టోరీలకు గట్టి ఎదురుదెబ్బ

- బ్రిటన్ సంక్షోభం ఎఫెక్టు
- ఉప ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ

• లోపలి పేజీలో..•

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 353 | విజయవాడ, ఆదివారం 23 జులై 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunay 23 July 2023 | Rs

ప్రకాశం బ్యారేజీకి వరద తాకిడి

ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదల చేస్తున్న నీరు

2

రోగుల మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

నెల్లూరు జిజిహెచ్‌లో కలకలం

- ఒకే రోజు ఆరుగురు మృతి
- ఆక్సిజన్ కొరతే కారణమని ప్రచారం
- విచారణకు కలెక్టర్ ఆదేశం
- అనారోగ్య కారణాల వల్లే మరణాలు : డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిజిహెచ్‌లో శుక్రవారం ఒక్క రోజే ఆరుగురు రోగులు మృతి చెందడం కలకలం రేపింది. మృతుల్లో సాంబయ్య (60), ఎస్.లీలావతి (62), పి.రమేష్ (42), ఎన్.చలపతి (52), వై.సుందరం (70), చెంచమ్మ (70) ఉన్నారు. ఆక్సిజన్ అందకే వారు మరణించారని మీడియాలో శనివారం రావడంతో దీనిపై విచారణ జరపాలని డిఎం అండ్ హెచ్ఒను జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. దీంతో, జిజిహెచ్‌కు వచ్చి డిఎం అండ్ హెచ్ఒ పెంచలయ్య విచారణ చేపట్టారు. ఆస్పత్రికి రోగులు ఎప్పుడు వచ్చారు? ఏ కండిషన్లో వచ్చారు. వారికి వైద్యులు ఎలాంటి వైద్యం అందించారు? వారు ఏ కారణంతో చనిపోయారు? అనే విషయాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ కూడా జిజిహెచ్‌కు వచ్చి వివరాలు సేకరించారు. మీడియాతో డిఎం అండ్ హెచ్ఒ పెంచలయ్య, జిజిహెచ్ సూపరింటెండెంట్ నాయక్ మాట్లాడుతూ ఆక్సిజన్ అందక చనిపోయారనేది దుష్ప్రచారమని తెలిపారు. ఆస్పత్రిలో ఆక్సిజన్ కొరత లేదని, ఆస్పత్రికి చెన్నయ్ నుంచి లిక్విడ్ ఆక్సిజన్ వస్తుంటుందని, ఆస్పత్రిలో మూడు ట్యాంకర్ల లిక్విడ్ ఆక్సిజన్ నిల్వ ఉందని చెప్పారు. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొంది చివరి దశలో ఇంటికి తీసుకెళ్లమన్న రోగులను జిజిహెచ్‌కు తీసుకొస్తుంటారన్నారు. ఇటువంటి వారి పరిస్థితి చాలా క్రిటికల్‌గా ఉంటుందని చెప్పారు. ఈ పరిస్థితిలో ఆస్పత్రికి వచ్చిన రోగులను బతికించడం కష్టమన్నారు. ఎంఐసియు యూనిట్‌లో చికిత్స పొందుతున్న ఆరుగురూ ఉదయం 9.33 నుంచి సాయంత్రం 6.28 గంటల మధ్యలో మృతి చెందారని తెలిపారు. చికిత్స అందించినా ఫలితం లేకపోయిందని, అనారోగ్య కారణాల వల్ల పరిస్థితి విషమించి వారు మరణించారని చెప్పారు. గత వారం రోజుల్లో మృతి చెందిన వారి వివరాలను మీడియాకు అధికారులు తెలియజేశారు. 17న ఒకరు, 18న నలుగురు, 19న ఇద్దరు, 20న ముగ్గురు, 21న ఆరుగురు, 22న నలుగురు మృతి చెందారని చెప్పారు.

సమగ్ర విచారణ జరపాలని సిపిఎం, సిపిఐ ధర్నా

మరణాలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన జిజిహెచ్ వద్ద శనివారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆస్పత్రిలో కనీసం లిఫ్ట్ కూడా పనిచేయడం లేదన్నారు. పలు వైద్య పరికరాలు మూలనపడ్డాయని తెలిపారు. కలెక్టర్ చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించాలని, కనీస వసతులు కల్పించాలని, రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి బి.కృష్ణయ్య, సిపిఐ నెల్లూరు జిల్లా కార్యదర్శి డి.వెంకయ్య, సిపిఐ రాష్ట్ర నాయకులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంక్రిమెంట్ ఎప్పుడు?

- సచివాలయ ఉద్యోగుల ఎదురుచూపులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు తొలి ఇంక్రిమెంట్ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రొబేషన్ పీరియడ్ 01.07.22న డిక్లేర్ చేయడంతో వారికి ఈ ఏడాది జులై ఒకటో తేదితో ఏడాది సర్వీసు పూర్తయింది. ఏడాది పూర్తయిన తరువాత జీతంతో పాటు, ఇంక్రిమెంటు కూడా ఇయ్యాలన్న సంగతి తెలిసిందే. అయితే, ప్రభుత్వ ఉత్తర్వులు రాలేదంటూ అధికారులు ఇంక్రిమెంటు నిలిపి వేశారు. జులై నెల జీతంతో పాటు సచివాలయ ఉద్యోగులకు రూ.620 ఇంక్రిమెంట్ కింద వారి జీతాలకు అదనంగా కలపాల్సి ఉంది. ఉద్యోగులకు జీతంతో పాటు ఇంక్రిమెంట్ కలపాలని సర్వీస్ రిజిస్టర్ (ఎస్ఆర్) నిర్వహించే అధికారి అధికారి ప్రొసీడింగ్స్‌ను డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారి (డిడిఒ)లకు ఇవ్వాల్సి ఉంది. గ్రేడ్-5,6 పంచాయతీ కార్యదర్శుల ఎస్ఆర్ మెయిన్‌టెయిన్ చేసే అధికారిగా ఎంపిడిఒ, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు సంబంధించి డిడి సోషల్ వెల్ఫేర్ అధికారి, మహిళా పోలీసులకు జిల్లా ఎస్‌పి, ఉద్యానవనశాఖకు డిడి హార్టికల్చరల్ అధికారి ఎస్ఆర్ నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. ప్రభుత్వం నుండి ఉత్తర్వులు లేవంటూ వీరు ఇంక్రిమెంటుకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను జారీ చేయలేదు. ఒక్క విజయనగరం జిల్లాలోనే కలెక్టర్ నాగలక్ష్మి ఈ తరహా ఉత్తర్వులు జారీ చేశారు. మిగిలిన శాఖలు, ఇతర జిల్లాల్లో కలెక్టర్లు ఇటువంటి ప్రొసీడింగ్స్ ఇవ్వకపోవడంతో ఎస్ఆర్ మెయిన్ టెయిన్ చేసే అధికారులు డోలాయమానంలో ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇంక్రిమెంటుపై గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

రొటీన్ ప్రక్రియే : అజయ్‌జైన్

ఉద్యోగులు రెగ్యులర్ అయిన ఏడాది తర్వాత ఇంక్రిమెంట్ జీతాలతో జమ చేయడమనేది రొటీన్ ప్రక్రియే అని గ్రామ వార్డు సచివాలయాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. ఎస్ఆర్ మెయిన్‌టెయిన్ చేసే అధికారులు ప్రొసీడింగ్స్ ఇవ్వని కారణంగా డిడిఒలు ఇంక్రిమెంట్ జమ చేయలేదనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలోనే ఇంక్రిమెంట్‌కు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేస్తామని చెప్పారు.

పుస్తకాల్లేవు!

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉచిత పుస్తకాల పంపిణీ నిలిపివేత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'విద్యారంగానికి వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం, ఏ రాష్ట్రం కూడా ఇంత మొత్తంలో విద్యకు ఖర్చు చేయడం లేదు' అని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న మాట. ఇంత ఖర్చు చేస్తున్నా.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు పుస్తకాలను అందించలేకపోతుంది. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థుల కోసం కేవలం రూ.15 కోట్లను ప్రభుత్వం ఖర్చుపెట్టకపోవడం గమనార్హం.

నాలుగేళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత పుస్తకాలు అందించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. రాష్ట్రంలో 474 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు సుమారు 1.30 లక్షల మంది ఉన్నారు. వీరికి పుస్తకాల కోసం అయ్యే ఖర్చు రూ.15 కోట్ల లోపే ఉంటుంది. వైసిపి అధికారంలోకి వచ్చాక 2019-20 విద్యా సంవత్సరానికి మాత్రమే ఉచిత పుస్తకాలను అందించింది. మధ్యలో కొంతకాలం వరకు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) పుస్తక ప్రసాదం పేరుతో అందించింది.

గతేడాది నుంచి విద్యార్థులకు ఉచిత పుస్తకాలను అందించడం లేదు. ఈ ఏడాది కూడా పుస్తకాల ముద్రణకు ఆర్థికసాయం చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు టిటిడికి లేఖ రాసినా ఫలితం లేకుండాపోయింది. టిటిడి తిరస్కరించడంతో ఆర్థికశాఖకు కూడా బోర్డు లేఖ రాసింది. అమ్మఒడి పథకం ఇంటర్ విద్యార్థులకు కూడా అందిస్తున్నామని, కాబట్టి పుస్తకాలను అందించలేమని బోర్డుకు ఆర్థికశాఖ తెలిపింది. అమ్మఒడి పేరుతోనే మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా ప్రభుత్వ కళాశాలల్లో ప్రభుత్వం నిలిపేసింది. తెలుగు అకాడమీ బయట మార్కెట్‌లో అమ్మేందుకు మొదటి సంవత్సరం పుస్తకాలను 5 లక్షలు, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కోసం 3.5 లక్షలను ముద్రించింది. బయట మార్కెట్ నుంచి కొనుగోలు చేయాలంటే సైన్స్ పుస్తకాలు సుమారు రూ.2,500, ఆర్ట్స్ గ్రూపు పుస్తకాలు సుమారు రూ.1,500 వరకు ఖర్చవుతోంది. పుస్తకాల పంపిణీ నిలిపివేయడంతో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు కొనలేని పరిస్థితి నెలకొంది. లెక్చరర్లే రెండో ఏడాది పూర్తయిన విద్యార్థుల నుంచి సేకరించి కొంతమంది విద్యార్థులకు సర్దుబాటు చేస్తున్న పరిస్థితి నెలకొంది. కొంత ఆర్థిక వెసులుబాటు ఉన్న విద్యార్థులు బయట మార్కెట్ నుంచి కొనుగోలు చేసుకుంటున్నారు. విద్యార్థులు పుస్తకాలు ఉన్నా మొత్తం చదవలేరని, లెక్చరర్లు చెబుతున్న ముఖ్యమైన పాఠాలను విద్యార్థులు నోట్ పుస్తకాల్లో రాసుకుంటున్నారని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు సమాధానం చెబుతున్నారు. కెజిబివి, మోడల్ స్కూళ్లు, ఎపి రెసిడెన్షియల్, గిరిజన, సాంఘిక, బిసి వెల్ఫేర్ కళాశాలల్లోని విద్యార్థులకు ఉచిత పుస్తకాలను ప్రభుత్వమే అందిస్తోంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులపై ఈ వివక్షను ప్రభుత్వం ఎందుకు చూపుతోందో అర్థం కావడం లేదు.

కెజిబివి, మోడల్ స్కూల్ విద్యార్థులదీ అదే పరిస్థితి

కెజిబివి, మోడల్ స్కూల్ విద్యార్థులకు కూడా పూర్తిస్థాయిలో పుస్తకాలు అందని పరిస్థితి నెలకొంది. ఎన్‌టిఆర్ జిల్లాలోని ఒక మోడల్ స్కూల్‌లో మొత్తం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 1,490 పుస్తకాలు సరఫరా చేయాల్సి ఉంది. ఇందులో 367 పుస్తకాలు మాత్రమే ఇప్పటివరకు అందాయి. ద్వితీయ సంవత్సరం తెలుగు, ఇంగ్లీష్, మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, ఎకనామిక్స్ పుస్తకాలు అందలేదు. కెజిబివి, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

మాకు న్యాయం కావాలి

- సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు జరగాలి
- జంతర్ మంతర్‌లో మణిపూర్ కుకీల భారీ ఆందోళన

కాషాయ మూకల కుట్రలకు బలైపోయిన కుటుంబ సభ్యులకు చురాచంద్‌పూర్‌లో నివాళులర్పిస్తున్న కుకీ తెగ ప్రజలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సామూహిక అత్యాచారానికి గురైన మహిళలకు న్యాయం చేయాలని, కుకీలు అధికంగా ఉండే ప్రాంతాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని, హింసను ఆపాలని డిమాండ్ చేస్తూ మణిపూర్‌కు చెందిన కుకీలు భారీ ఆందోళన చేపట్టారు. శనివారం నాడిక్కడ జంతర్ మంతర్‌లో ఉమ్మడి కుకీ విద్యార్థి వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన ఆందోళనలో వేలాది మంది కుకీలు పాల్గొన్నారు. ప్లకార్డులు పట్టుకుని న్యాయం చేయాలని, దోషులను శిక్షించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. అధికార బిజెపి ముఖ్యమంత్రి ఎన్. బీరెన్ సింగ్‌పైనా, సిబిఐపైనా తమకు విశ్వాసం లేదని ప్రకటించిన కుకీ నేతలు, హింసాకాండపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ కోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించారు. "భారతీయులుగా గర్విస్తున్నాం. మణిపూర్‌లోని కొన్ని సాయుధ గ్రూపులు కోరుకునేది స్వేచ్ఛ కాదు. బదులుగా రాజ్యాంగ స్వయంప్రతిపత్తి అవసరం. భౌగోళికంగా, మానసికంగా మైతీల నుంచి వేరు చేయబడ్డాం. ఎన్.బీరెన్ సింగ్ హయాంలో రాష్ట్రంలో నిరంకుశ పాలన జరుగుతోంది. బీరెన్ సింగ్ హయాంలో కొనసాగదు. మసీదులు, చర్చలను తగులబెట్టినప్పటికీ, చురచంద్‌పూర్‌తో ఒక్క హిందూ మందిరం కూడా ధ్వంసం కాలేదు" అని పేర్కొన్నారు. మసీదులో ప్రార్థనలు చేస్తున్న మహిళకు మైతీ దుండగులు నిప్పంటించారని, హత్యకు గురైన కుకీల మృతదేహాలు ఇంఫాల్‌కు కూడా చేరుకోలేక మార్చురీలో కుప్పలుగా పోసి ఉన్నాయని కుకీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుకీలు మయన్మార్ నుంచి అక్రమంగా వలస వచ్చిన వాళ్లగా చిత్రీకరిస్తున్నారని, అలాంటప్పుడు సరిహద్దుల్లో కాపలా కాస్తున్న సైనికులు, వారికి ఆధార్ కార్డులు, పాస్ పోర్టులు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం విదూషకులా అని నేతలు ఆగ్రహంతో ప్రశ్నించారు. చివరి వరకు పోరాటాన్ని కొనసాగించాలని, విభజన లేకుండా అప్రమత్తంగా ఉండాలని నాయకులు కుకీలకు సూచించారు. ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసే ముందు వాటిని నిర్ధారించుకోవాలని కూడా పిలుపునిచ్చించారు. జాతీయ గీతం ఆలపించిన అనంతరం ఆందోళన విరమించారు. నిరసన వేదిక వద్ద భారీ పోలీసు బలగాలు మోహరించాయి.

సజ్జల చెప్పినట్లే నడుచుకోమన్నారు!

- ఆయన ఆలోచన ఇబ్బందిగా అనిపించింది
- అవినాష్ అభ్యర్థిత్వాన్ని నాన్న కోరుకోలేదు
- సిబిఐకి సునీత వాంగ్మూలం

2

ప్రతి రైతూ శాస్త్రవేత్తే

- వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- పులివెందులలో రైతు శాస్త్రవేత్త శిక్షణ శిబిరం ప్రారంభం

3

ఆర్‌టిసి బస్సును ఆయిల్ ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న ట్యాంకర్

- నలుగురు మృతి
- జాతీయ రహదారిపై స్తంభించిన రాకపోకలు

ప్రజాశక్తి- పుల్లంపేట (అన్నమయ్య జిల్లా)

అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. 25 మందికి గాయాలయ్యాయి. వారిలో ఒక మహిళ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం... చిన్నఓరంపాడు మలుపు వద్ద జాతీయ రహదారిపై కడప నుంచి తిరుపతి వెళ్తున్న ఆర్‌టిసి బస్సును ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో, బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడకక్కడే మృతి చెందారు. వారిలో ఓబులవారిపల్లె మండలం జ్ఞానంపల్లికి చెందిన గుండాల శ్రీనివాసులు (55), రాజంపేట మండలం వెంకటరాజంపేటకు చెందిన కోమవతి శేఖర్ (45), కడపకు చెందిన కమలోకర్ బాషా (65) ఉన్నారు. తీవ్రంగా గాయపడిన చిట్వేలికి చెందిన దుగ్గిలపాడు అమర్‌నాథ్‌రెడ్డి (48) రాజంపేటకు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. గాయపడిన 25 మందిని రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ఒక మహిళ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించారు. లారీ డ్రైవర్ అతి వేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు, స్థానికులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో బస్సులో 58 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు ఒకపక్క నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంతో మిగతా 2లో

మధ్యప్రదేశ్‌లోనూ బుల్డోజర్ రాజ్

- ఊరేగింపు సందర్భంగా ఉమ్మి వేశారంటూ ముస్లిం యువకుల అరెస్టు
- ఇళ్లు కూల్చివేత

ఉజ్జయిని : మధ్యప్రదేశ్‌లో మరోసారి బుల్డోజర్ రాజ్‌ను అక్కడి బిజెపి సర్కారు అమలు చేసింది. 'మహాకాల్ కీ సవారీ' ఊరేగింపు వెళుతుండగా ఉమ్మి వేసినట్లు ఆరోపించి ఇద్దరు మైనర్లుసహా ముగ్గురు ముస్లిం యువకులను అరెస్టు చేయడంతోపాటు వారి ఇళ్లు కూల్చేసిన సంఘటన మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని నగరంలో జరిగింది. ఈ నెల 17న ఉజ్జయిని నగరంలోని ఛాత్రి చౌక్ ఏరియాలో ఊరేగింపులో పాల్గొన్న యువకులు తీసిన రెండు వేర్వేరు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. నిందితుల్లో ఇద్దరు మైనర్లు కాగా, మూడో వ్యక్తికి 18ఏళ్లు. వారిని అరెస్టు చేయడంతోపాటు వారి ఇళ్ల కూల్చివేత సందర్భంగా డ్రమ్ములు, డిజె మ్యూజిక్‌లతో హోరెత్తించారు. 'బుల్డోజర్ న్యాయం' పేరుతో జరుగుతున్న ఘోరాల జాబితాలో ఇదొక కొత్త చేరిక.

ఆ ముగ్గురు యువకులపై ఖరకువా పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. మత భావాలను దెబ్బతీసేందుకు ఉద్దేశ్యపూర్వకంగా చర్యలు చేపట్టడం, ఆరాధనా స్థలంలో నేరాలు, మత పరమైన సమావేశాలను కల్లోలపరచడం వంటి అభియోగాలను మోపారు. ఇండోర్ వాసి మసూమ్ జైస్వాల్ తన ఫోన్‌లో ఈ మొత్తం సంఘటనను రికార్డు చేశాడని ఫిర్యాదీదారుడు సావన్ లాట్ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నాడు. వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

నిందితుల్లో ఇద్దరి బంధువైన అక్బర్ హుస్సేన్‌తో ది వైర్ మాట్లాడింది. కూల్చివేసిన ఆ ఇంట్లోనే వీరి కుటుంబం కూడా నివసిస్తోంది. తమ పిల్లలు ఉమ్మి వేశారని అనడాన్ని ఆయన తోసిపుచ్చారు. ఏటా ఊరేగింపులు జరుగుతాయని, వాటిని తాము స్వాగతిస్తామని చెప్పారు. అసలు ఊరేగింపుపై ఉమ్మి వేస్తున్నట్లు వీడియోలో స్పష్టంగా కనిపించడం లేదని చెప్పారు. పిల్లలు చాలా చిన్నవారని, వారికేమీ తెలియదని అన్నారు. ఊరేగింపు సందర్భంగా అన్ని దుకాణాలను మూసివేయాలని అధికారులు ఆదేశించారని, తాము లోపల విశ్రాంతి తీసుకుంటుండగా పిల్లలు పక్క భవనంపై టెర్రస్‌మీద ఆడుకుంటున్నారని చెప్పారు. ఊరేగింపులోని కొంతమంది పోలీసు స్టేషన్ వద్ద నిరసన చేయడం చూశామని కానీ అవేమీ పట్టించుకోకుండా ఊరేగింపు అయిన తర్వాత సాధారణంగానే తమ దుకాణాలు తెరిచామని చెప్పారు. తమ ఇంటికి దగ్గర్లోనే పోలీసు స్టేషన్ వుందని, అక్కడి వారంతా తెలుసునని, అక్కడ నినాదాలు, నిరసనలు జరగడం కూడా సాధారణమేనని చెప్పారు. తమ పిల్లలను పోలీసు అధికారి పిలిచారని చెప్పగానే మందలించి పంపేస్తారనే భావనతో వెనక ఎవరూ లేకుండానే పిల్లలను స్టేషన్‌కు మిగతా 5లో

'ఉక్కు' పరిరక్షణకు కాంగ్రెస్ పాదయాత్ర

- భారీగా తరలివచ్చిన శ్రేణులు
- సిఐటియు, ఆమ్ ఆద్మీ పార్టీ సంఘీభావం

2

ఒక్కో ఇల్లు మూడు రోజుల్లో

- షేర్‌వాల్ టెక్నాలజీతో అమరావతిలో మూడు నెలల్లో 30 వేల ఇళ్ల పూర్తికి చర్యలు
- గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల పేదలకు 47 వేల ఇళ్లు
- రేపు శంకుస్థాపన చేయనున్న సిఎం జగన్

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

మంగళగిరి మండలం కృష్ణాయపాలెంలో నిర్మిస్తున్న నమూనా గృహం

రాజధాని అమరావతి ప్రాంతంలోని ఆర్-5 జోన్‌లో పేదలకు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సన్నాహాలు చేస్తోంది. గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాలకు చెందిన 54 వేల మంది పేదలకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు ఈ నెల 24న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శంకుస్థాపన చేయనున్నారు. షేర్‌వాల్ టెక్నాలజీతో తక్కువ ఖర్చుతో వేగంగా నిర్మాణాలు పూర్తి చేసేందుకు గృహ నిర్మాణ శాఖాధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే మంగళగిరి మండలం కృష్ణాయపాలెంలో నమూనా గృహ నిర్మాణాలను అధికారులు ప్రారంభించారు. ఒక్కో ఇల్లు మూడు రోజుల్లో పూర్తి చేసేలా కాంట్రాక్టు సంస్థకు బాధ్యత అప్పగించారు. మొత్తం 47 వేల ఇళ్లకుగానూ 30 వేల ఇళ్లను మూడు నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించారు. అనంతరం వాటినినేరుగా లబ్ధిదారులకు అప్పగించనున్నారు. మిగతా 17 వేల ఇళ్లను లబ్ధిదారులు నిర్మించుకునేలా ప్రణాళిక రూపొందించారు. ఒక్కొక్క ఇంటికి రూ.2.11 లక్షలు కేటాయించారు. మొత్తం 25 లేఅవ్వుటలో 54 వేల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించగా, తొలి దశలో 47 వేల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. రాజధానికి భూములు ఇచ్చిన రైతులు ఇతర ప్రాంతాల్లోని వారికి ఇక్కడ ఇళ్ల స్థలాలు కేటాయించడాన్ని, ఇళ్ల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టు, సుప్రీంకోర్టులలో కేసులు దాఖలు చేశారు. ఇవి విచారణలో ఉన్న నేపథ్యంలో తుది తీర్పునకు లోబడి స్థలాలు కేటాయించాలని సుప్రీంకోర్టు సూచించింది. ఈ మేరకు ఇళ్ల పట్టాలపై సుప్రీంకోర్టు నిర్ణయాన్ని ముద్రించారు. ఇళ్ల నిర్మాణంపై న్యాయస్థానం స్టే ఇవ్వకపోవడంతో ప్రభుత్వం స్పీడ్ పెంచింది. రాజధానిలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడాన్ని సిఎం జగన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఎప్పటికప్పుడు గృహ నిర్మాణ శాఖాధికారులతో సమీక్షలు చేసి వీలైనంత త్వరగా 30 వేల ఇళ్లను పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ నెల ఎనిమిదిన ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని తొలుత ప్రకటించినా, కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ఇళ్ల నిర్మాణానికి తాము నిధులు ఇవ్వలేమని కేంద్ర ప్రభుత్వం చెప్పడంతో అప్పట్లో ఈ కార్యక్రమం వాయిదా పడింది. ఈ నెల 24న సిఎం జగన్ తొలుత కృష్ణాయపాలెంలో ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన అనంతరం ఇప్పటికే నిర్మించిన నమూనా గృహాలను, ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తారు. తరువాత తుళ్లూరు మండలం వెంకటపాలెంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో శనివారం మంత్రులు జోగి రమేష్, మేరుగు నాగార్జున, ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర ఉన్నతాధికారులు శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించారు.

గంజాయితో పట్టుబడ్డ లారీ

920 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-గోపాలపురం

కంటైనర్‌లో తరలిస్తున్న 920 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం శివారు టొబాకో బోర్డు వద్ద ఉన్న రాజస్థాన్ హోటల్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న కంటైనర్‌ను పోలీసులు తనిఖీ చేస్తుండగా లారీ డ్రైవర్ పరారయ్యారు. లారీ క్యాబిన్‌లోని 919.678 కేజీల గంజాయిని గుర్తించారు. గంజాయిని, కంటైనర్‌ను సీజ్ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

జగనన్న సురక్షలో అధికారుల నిర్బంధం

- అధికారుల హామీతో విడిచిపెట్టిన గ్రామస్తులు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం నాగులపల్లి పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమానికి వచ్చిన అధికారులను స్థానికులు నిర్బంధించారు. ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు విడిచిపెట్టేది లేదని తేల్చిచెప్పారు. మూడేళ్ల కిందట గ్రామంలో అర్హులైన 600 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల కోసం భూములు సేకరించారు. ఆ భూముల్లో స్థలాల విభజన చేయకుండా, సౌకర్యాలు కల్పించకుండా.. లబ్ధిదారులకు స్థల వివరాలు లేని ఖాళీ పట్టాలు అందజేశారు. అప్పటినుంచి లబ్ధిదారులు తమ స్థలాలు ఎక్కడ అని పలుమార్లు అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. దీంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి వచ్చిన ఎంపిడిఒ అబ్రహాం లింకన్, పలువురు అధికారులను నిర్బంధించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని వారించారు. దీంతో ఎంపిడిఒ జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ నెల 25న మరోసారి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించి, అధికారులను విడిచిపెట్టారు.

ఓటమి భయంతో దిగజారుడు విమర్శలు

- జగన్‌పై కన్నా ధ్వజం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతిపక్ష నేతలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగజారుడు విమర్శలు చేయటం తన ఓటమి భయానికి సంకేతమని టిడిపి నేత కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. ప్రజల సొమ్ముతో ప్రజల కోసం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో స్థాయి మరిచి చౌకబారుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. ప్రతి ఏటా రైతులు తీవ్రంగా నష్టపోతుంటే వారిని ఆదుకోవడానికి ఏనాడూ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. సిఎం, మంత్రులకు ప్రజల గురించి ఆలోచించడం, పరిపాలన చేతకాదని తేలిపోయిందన్నారు.

ప్రభుత్వ బహిరంగ సభలో వ్యక్తిగత దూషణలు సంస్కారమా? అని టిడిపి ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు సిఎం వైఎస్ జగన్‌ను ఒక ప్రకటనలో ప్రశ్నించారు. రాష్ట్రంలో కొంతమంది వలంటీర్లు అధికార పార్టీ అండతో కొన్ని అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనర్హులను కూడా ఓటర్లుగా చేర్చారని ఆరోపించారు. వివేకానందరెడ్డి కేసులో ఎవరి పాత్ర ఏమిటో సిబిఐ స్పష్టంగా తేల్చాక కూడా సిగ్గులేకుండా జగన్ విషప్రచారం చేస్తున్నారని టిడిపి అధికార ప్రతినిధి జివి రెడ్డి విమర్శించారు. ఈ కేసు విచారణలో సిబిఐ ఛార్జిషీట్‌లో అవినాష్‌రెడ్డి పాత్రకు సంబంధించి కీలక విషయాలు ప్రస్తావించారని పేర్కొన్నారు. సిబిఐ ఛార్జిషీట్ అబద్ధమైతే జగన్, అతని ప్రభుత్వం నాలుగేళ్లు అధికారంలో ఉండి ఎందుకు నిజాలు కనిపెట్టలేకపోయారని ప్రశ్నించారు.

సజ్జల చెప్పినట్లే నడుచుకోమన్నారు

- సిబిఐకి సునీత వాంగ్మూలం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సిబిఐకి ఆయన కుమార్తె సునీత ఇచ్చిన వాంగ్మూలంలో కీలక విషయాలు వెల్లడించారు. సునీతతో పాటు పలు కీలక సాక్ష్యాలను జూన్ 30న సిబిఐ కోర్టుకు అధికారులు సమర్పించారు. కోర్టు విచారణ నేపథ్యంలో అవి తాజాగా బయటకు వచ్చాయి. "నాన్న హత్య తర్వాత 2019 మార్చి 22న వైఎస్ భారతి నాకు ఫోన్ చేశారు. ఇంటికి వచ్చి కలుస్తానన్నారు. నేను కడప, సైబరాబాద్ కమిషనరేట్ వెళ్లాల్సి ఉందని భారతికి చెప్పా. ఎక్కువ సమయం తీసుకోను అంటూ భారతి మా ఇంటికి వచ్చేశారు. ఆమెతో పాటు విజయమ్మ, వైఎస్ అనిల్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి రావడంతో నేను ఆశ్చర్యపోయాను. లిఫ్ట్ వద్దే నిలబడి భారతితో మాట్లాడా. ఆ సమయంలో భారతి ఆందోళనగా కనిపించారు. నాన్న లేరనే బాధగా ఉన్నారని అనుకున్నా. కేసుకు సంబంధించి ఇకపై సజ్జల రామకృష్ణారెడ్డితో టచ్‌లో ఉండాలని భారతి చెప్పారు. ఆయన చెప్పినట్లే మాట్లాడాలని సూచించారు. సజ్జల ఆలోచన కొంత ఇబ్బందిగా అనిపించి నేరుగా మీడియాతో మాట్లాడకుండా ఒక వీడియో రికార్డు చేశా. నాన్న గది శుభ్రం చేసేటప్పుడు అక్కడే ఉన్న సిఐ శంకరయ్యపై ఫిర్యాదు చేస్తున్నట్లు వీడియో చేసి సజ్జలకు పంపించాను. వీడియో కాదు.. అంశానికి ముగింపు పలికేలా ప్రెస్‌మీట్ పెట్టాలని సజ్జల చెప్పారు.

జగనన్నతో పాటు అవినాష్ పేరు కూడా ప్రస్తావించాలని సజ్జల సలహా ఇచ్చారు. నేను అప్పటివరకు అవినాష్ పేరు ఎక్కడా ప్రస్తావించలేదు. అవినాష్ పేరు ప్రస్తావించాలని సజ్జల చెప్పినప్పుడు కొంత సంకోచించా. ఎన్నికల్లో అవినాష్ అభ్యర్థిత్వాన్ని మా నాన్న కోరుకోలేదని తెలుసు. రెండు కుటుంబాల మధ్య దశాబ్దాలుగా విభేదాలున్నాయి. సజ్జల సలహా మేరకు హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్ పెట్టా. జగనన్నను సిఎంగా చూడాలని నాన్న చాలా కష్టపడ్డారు" అని సిబిఐకి ఇచ్చిన వాంగ్మూలంలో సునీత తెలిపారు.

టిడిపి నేతలపై ఫిర్యాదు చేయమన్నారు

'నాన్నకు పోస్టుమార్టం జరిగిన మార్చురీ వద్దకు ఓ ఫిర్యాదు రాసుకొచ్చి అవినాష్ సంతకం చేయమన్నారు. ఆ ఫిర్యాదులో బిటెక్ రవి, ఇతర టిడిపి నేతల పేర్లున్నాయి. వివేకా ఎన్నికల ప్రచారానికి టిడిపి నేతలు భయపడ్డారని అవినాష్ నాకు చెప్పారు. టిడిపి నేతలు మనసులో ఏదో పెట్టుకొని ఈ నేరానికి పాల్పడ్డారని అవినాష్ అన్నారు. ఆ ఫిర్యాదుపై నేను సంతకం చేయలేదు. నాన్న హత్య విషయం మా కుమారుడికి ముందే తెలుసునని అవినాష్ ముఖ్య అనుచరుడు గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి తల్లి ఒకరితో చెప్పారు. అప్పుడు నాకు అవినాష్‌రెడ్డిపై అనుమానం వచ్చింది' అని సునీత చెప్పినట్లు సిబిఐ కోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది.

జగనన్న కాలనీల్లో ఎల్‌ఇడి బల్బులు

- ఇఇఎస్‌ఎల్‌తో గృహ నిర్మాణశాఖ ఒప్పందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లోని ఇళ్లకు ఎల్‌ఇడి బల్బులు అందించేలా ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఇఇఎస్‌ఎల్) ఏపి ఇంధన సామర్థ్య అభివృద్ధి సంస్థ (ఏపిసిడ్కో) మధ్య శనివారం అవగాహన ఒప్పందం కుదిరింది. గోవాలో జరిగిన జి20 సదస్సులో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, ఇఇఎస్‌ఎల్ సిఇఒ విశాల్‌కపూర్ ఇందుకు సంబంధించిన ఎంఒయుపై సంతకాలు చేసి ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. 6 లక్షల ఎల్‌ఇడి బల్బులు, 3 లక్షల ఎల్‌ఇడి ట్యూబ్‌లైట్లు, 3 లక్షల బిఎల్‌డిసి సీలింగ్ ఫ్యాన్లు సరఫరా చేయనున్నారు. ఇంధన సామర్థ్య ఫలాలను సామాన్యులకు అందించడంలో గృహ నిర్మాణశాఖ చురుగ్గా పనిచేస్తోందని కపూర్ అభినందించారు. ఏపి హౌసింగ్ పథకంలో ఇంధన సామర్థ్య ప్రాజెక్టు అత్యంత కీలకంగా నిలుస్తుందని తెలిపారు. ఈ విషయంలో ఏపి దేశంలోని ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఏపి చేపట్టిన గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులకు అత్యుత్తమ నాణ్యత, తక్కువ ఖర్చుతో కూడిన ఇంధన సామర్థ్య ఉపకరణాలను అందించడమే లక్ష్యమని తెలిపారు. విద్యుత్ బిల్లులను తగ్గించడమే కాకుండా ఇంధన సామర్థ్యాన్ని పెంచడం, పర్యావరణాన్ని పరిరక్షించడం కూడా ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రూ.400 కోట్లతో ఇంధన సామర్థ్య ఉపకరణాలను అందించనున్నట్లు వివరించారు. ఏపికి ఇఇఎస్‌ఎల్ పూర్తిస్థాయి మద్దతు ఇస్తుందని చెప్పారు. ఏపిలో పెద్దఎత్తున ఇంధన సామర్థ్య ప్రాజెక్టులను అమలు చేయడానికి మరిన్ని అవకాశాలను గుర్తించామని తెలిపారు. అజయ్‌జైన్ మాట్లాడుతూ.. రాష్ట్ర హరిత ఇంధన భవిష్యత్తుకు ఇదో కీలక ముందడుగు అని అన్నారు. ఈ ప్రాజెక్టును గృహ నిర్మాణశాఖ యుద్ధ ప్రాతిపదికన చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిసిడ్కో ఎండి కుమార్‌రెడ్డి, ఇఇఎస్‌ఎల్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు వెంకటేష్ ద్వివేది, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పరిరక్షణకై ప్రజా ఉద్యమం

- దళిత, గిరిజన ప్రజా సంఘాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన రిజర్వేషన్లను ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులకు ప్రమోషన్లలో అమలు చేయకుండా నిర్వీర్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై పోరాడేందుకు సన్నద్ధం కావాలని దళిత, గిరిజన సంఘాల నేతలు పిలుపునిచ్చారు. విజయవాడలోని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో దళిత, గిరిజన జెఎసి ఆధ్వర్యంలో శనివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ల పరిరక్షణ పోరాట కమిటీ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సమావేశంలో ఇన్‌కమ్ ట్యాక్స్ రిటైర్డ్ కమిషనరు డాక్టర్ ఉప్పులేటి దేవీప్రసాద్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యరావు, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం నాయకులు మేడికొండ ప్రసాదరావు, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు, ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం రత్నప్రదీప్, బుస్సారత్న ప్రసాద్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరిపోగు వెంకటేశ్వర్లు, గిరిజన సంఘం అధ్యక్షులు బి చంద్రనాయక్, రెల్లి సంఘం అధ్యక్షులు ఎస్ నాగేంద్ర, కెవిపిఎస్ అధ్యక్షులు పరిశపోగు రాజేష్, పలు దళిత, గిరిజన ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'ఉక్కు' పరిరక్షణకు కాంగ్రెస్ పాదయాత్ర

- భారీగా తరలివచ్చిన శ్రేణులు
- సిఐటియు, ఆమ్ ఆద్మీ పార్టీ సంఘీభావం

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

వందలాది మందితో సాగుతున్న ఉక్కు పరిరక్షణ పాదయాత్ర

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన శనివారం గాజువాక సమీపంలోని జింక్ గేట్ నుంచి కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం వరకూ పాదయాత్ర నిర్వహించారు. ఉత్తరాంధ్ర నుంచి భారీగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. 'సేవ్ వైజాగ్ స్టీల్' అంటూ నినాదాలు చేశారు. వారికి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, కార్యకర్తలు, స్టీల్‌ప్లాంట్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు తోడయ్యారు. కొత్త గాజువాక, పాత గాజువాక, శ్రీనగర్ మీదుగా సాగిన ఈ పాదయాత్ర కూర్మన్నపాలెం కూడలికి చేరుకుంది. 891వ రోజుకు చేరుకున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ దీక్షలకు సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ విశాఖ ఇంతలా అభివృద్ధి చెందడానికి విశాఖ ఉక్కు పరిశ్రమే కారణమన్నారు. ఎందరో త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ ఈ కర్మాగారాన్ని అమ్మే హక్కు ఎవ్వరికీ లేదని తెలిపారు. ఎవడబ్బ సొత్తని మోడీ ప్రభుత్వం ప్లాంట్‌ను అమ్మడానికి కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని ప్రకటించే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. త్వరలో రాహుల్ గాంధీ విశాఖకు వచ్చి ఉక్కు కార్మికుల పోరాటానికి మద్దతు తెలుపనున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, కేంద్ర మంత్రులు విశాఖ స్టీల్‌ప్లాంట్ భూములపై రియల్ ఎస్టేట్ వ్యాపారం చేద్దామని అనుకుంటున్నారని, ఈ నేపథ్యంలోనే ఉక్కు ప్రయివేటీకరణకు సిద్ధమయ్యారని విమర్శించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలూ ఒకే తాటిపైకి వచ్చి విశాఖ ఉక్కును కాపాడుకోవాలన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను నిర్వీర్యం చేయాలని చూస్తోన్న బిజెపి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ ఈ నెల 28, 29, 30 తేదీల్లో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

పాదయాత్రలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కో-కన్వీనర్ జె.అయోధ్యరాం, కాంగ్రెస్ నేతలు అప్పలనాయుడు, వెంకటేష్, గవర వెంకట రమణారావు, జెర్రిపోతుల ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న లోకేష్

మార్కాపురాన్ని జిల్లా చేస్తాం

- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి-పొదిలి (ప్రకాశం జిల్లా)

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురాన్ని జిల్లా చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ హామీ ఇచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర శనివారం పొదిలిలో కొనసాగింది. అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ.. టిడిపి నాయకులను, కార్యకర్తలను వేధిస్తున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టమని, వడ్డీతో సహా చెల్లిస్తామని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటామని తెలిపారు. పదో తరగతి పేపర్లు కొట్టేసి జైలుకి వెళ్లాడని, సొంత తల్లి, చెల్లిని బయటకి గెంటేసే చీప్ క్యారెక్టర్ జగన్‌ది అని అన్నారు. నాది కాలేజ్ లైఫ్...నీది జైల్ లైఫ్ అని ఆరోపించారు. 'స్విమ్మింగ్ పూల్ వీడియో చూసాడట.. స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్ చేయ్యకపోతే జాగింగ్ చేస్తామా? 20 సంవత్సరాల క్రితం ఫ్రెండ్స్‌తో స్విమ్మింగ్‌కి వెళ్ళాను అందులో తప్పేంటి?' అని లోకేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వేల సమయం

- పార్టీల తరపున రంగంలోకి ప్రచార కంపెనీలు
- ప్రభుత్వం తరపున అన్ని కార్యక్రమాలకూ వెళుతున్న ఐప్యాక్
- ప్రతిపక్ష టిడిపి తరపున రాబిన్‌శర్మ గ్రూపు

రాబిన్ శర్మ (టిడిపి), ఐ-ప్యాక్ (వైసిపి), ఎపిఫైబర్ నెట్ (రాష్ట్ర ప్రభుత్వం)

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల వాతావరణం సమీపిస్తున్న కొద్దీ రాష్ట్రంలో రాజకీయ సర్వేలూ పెరుగుతున్నాయి. ఏజెన్సీల తరపున పెద్దఎత్తున సంస్థలు రంగంలోకి దిగాయి. ఇప్పటికే వైసిపి తరపున ఐప్యాక్ బృందం పనిచేస్తుండగా, టిడిపి తరపున రాబిన్‌శర్మ గ్రూపు ప్రచారం చేస్తోంది. ఇప్పటికే రెండు మూడు విడతలుగా ఆయా సంస్థలు సమావేశాలు కూడా నిర్వహించాయి. ప్రభుత్వం నుండి ఎపిఎఫ్‌ఎస్‌ఎల్ కూడా ఆన్‌లైన్ సర్వే చేపట్టింది. రెండురోజులకు ఒకసారి సర్వే ఫైబర్ నెట్ వాడే వారికి టివిల్లోనే పంపిస్తున్నారు. దీనిపై వారు క్లిక్ చేసి ఏదో ఒకటి నొక్కిందాకా ఐకాన్ స్క్రీన్‌మీద నుండి తొలగదు. ఇప్పటికే అన్ని సంస్థలూ ఒక విడత ఎన్నికల సర్వేలు మొదలుపెట్టాయి. ఓటర్ల అభిప్రాయం, అభ్యర్థులు, కులం, డబ్బు నాలుగు అంశాలపై సర్వే ప్రారంభించాయి. ఇప్పటికే ఉభయగోదావరి జిల్లాలపై ఎక్కువ దృష్టి సారించాయి. ప్రభుత్వం తరపున ప్రచారం ప్రారంభించిన ఐప్యాక్ గ్రూపు ఇప్పటికే అన్ని పార్టీల కార్యక్రమాలు, ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలపై దృష్టి సారించింది. విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే కార్యక్రమాలను కూడా ప్రతిరోజూ ఐప్యాక్ సిబ్బంది కవర్ చేస్తున్నారు. అక్కడ నుండి ఫీడ్‌బ్యాక్ ప్రభుత్వానికి పంపిస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేల వారీ సర్వే పూర్తి చేసిన ఐప్యాక్, ఎంపిల సర్వేనూ దాదాపు పూర్తి చేయబోతోంది. ఈసారి ఎంపి అభ్యర్థులను ఎక్కువమందిని మార్చే అవకాశముందని తెలిసింది. ఎమ్మెల్యేలకు సంబంధించి నెలకోసారి నివేదిక ఇస్తుండటం, సిఎం దానిపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి పూర్‌గా ఉన్న ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇవ్వడం, తప్పదనుకున్న వారిలో కుటుంబ సభ్యులకు టికెట్ ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేసుకునేలా సూచనలివ్వడం చేస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఐప్యాక్ పెద్ద పాత్ర పోషిస్తోంది. దీంతోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రాజకీయ సర్వేకు సంబంధించి చిత్తూరు జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే సంస్థ కీలకంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే బిఆర్‌ఎస్ పార్టీకి సర్వే చేసే బాధ్యతలూ చేపట్టినట్లు తెలిసింది. అదే సంస్థ రాష్ట్రంలోనూ నియోజకవర్గాలకు సిబ్బందిని నియమించి వాటిల్లో జరిగే కార్యకలాపాల వివరాలను ప్రతిరోజూ నివేదిక రూపంలో తెప్పించుకునే ఏర్పాట్లు చేస్తోంది. ఇక తెలుగుదేశం పార్టీ తరపున రాబిన్‌శర్మ గ్రూపు ప్రచార బాధ్యతలు చేపట్టింది. ఇది ఇప్పటికే రంగాల వారీ సమావేశాల ఏర్పాటు చేయిస్తోంది. ఎప్పటికప్పుడు నియోజకవర్గాల నుండి ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం, యువగళం కవరేజీ తదితర అంశాలను చూస్తోంది. దీంతోపాటు నియోజకవర్గాల్లో ఎవరి పట్ల ఎలాంటి అభిప్రాయం ఉందని ఇన్‌ఛార్జుల పనితీరుపైనా నిరంతరం సర్వేలు చేయిస్తోంది.

ఇసి ఆదేశాలు భేఖాతరు చేస్తున్న వలంటీర్లు : జనసేన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల సంఘం ఆదేశాలను గ్రామ వలంటీర్లు భేఖాతరు చేస్తున్నారని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ శనివారం ట్విట్టర్‌లో పోస్టు చేశారు. బూత్‌లెవల్ అధికారులతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ వలంటీర్లు ఇంటింటి సర్వే ప్రక్రియలో భాగస్వామ్యమవుతూ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని, ఈ విషయంపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అవసరమైన నిబంధనలను తక్షణమే అమలు చేయాలని భారత ఎన్నికల సంఘాన్ని జనసేన డిమాండ్ చేస్తోందని అన్నారు. మెగా డిఎస్‌సి నోటిఫికేషన్, ఉపాధ్యాయ రిక్రూట్‌మెంట్ లేదని, కనీసం టీచర్ ట్రైనింగ్ లేదని, కానీ నష్టాలు వచ్చే స్టార్టప్‌కి కోట్లలో కాంట్రాక్టు ఎలా వస్తోందని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం స్టాండర్డ్ ప్రొటోకాల్‌ను పాటించిందా? టెండర్ కోసం ఎన్ని కంపెనీలు దరఖాస్తు చేశాయి? ఎవరు షార్ట్ లిస్ట్ చేశారు? ఇది పబ్లిక్ డొమైన్‌లో ఉందా? అని ట్విట్టర్ వేదికగా పవన్ కల్యాణ్ ప్రశ్నించారు.

ప్రకాశం బ్యారేజీకి వరద తాకిడి

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి, తాడేపల్లి, విజయవాడ

ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో కురుస్తోన్న వర్షాలతో మున్నేరు, పాలేరు, బుడమేరుల నుంచి భారీగా వరద నీరు ప్రకాశం బ్యారేజీకి వచ్చి చేరుతోంది. శనివారం ఉదయం బ్యారేజీకి 17,377 క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. తూర్పు డెల్టాకు 6150 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 1,591 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్‌కు 88 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. బ్యారేజీ 14 గేట్లు అడుగు మేర ఎత్తి సముద్రంలోకి దాదాపు 9,500 క్యూసెక్కుల నీటిని విడిచి పెడుతున్నారు. 14 వేల క్యూసెక్కులకు వరద నీరు చేరి క్రమంగా వరద తగ్గుతోందని జలవనరుల శాఖ ఎస్‌ఇ టిజెహెచ్ ప్రసాదబాబు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజీకి వచ్చిన వరద నీరు వల్ల ఎటువంటి ప్రమాదమూ లేదని విపత్తుల నిర్వహణ శాఖ పేర్కొంది. అయితే, నదీ పరివాహక ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని తాడేపల్లి తహశీల్దార్ నాగిరెడ్డి తెలిపారు. గతేడాది ఇదే రోజుల్లో నాగార్జునసాగర్, పులిచింతలకు వరద తాకిడితో ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తింది. ఈ ఏడాది ఎగువ రాష్ట్రాల్లో సరైన వర్షాలు లేక ఆల్మట్టికి నీరు రాకపోవడం, కృష్ణా పరివాహక ప్రాంతంలో ఇప్పటికి వరకు సాధారణ స్థాయిలో కూడా వర్షాలు లేకపోవడంతో జలాశయాలు నీరులేక వెలవెలబోతున్నాయి.

నేడు ధవళేశ్వరం వద్ద వరద పెరిగే అవకాశం

- కాటన్ బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద
- ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌టి ఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధం
- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఐఎండి అంచనాల ప్రకారం ఎగువున ఉన్న గోదావరి పరీవాహక రాష్ట్రాల్లో మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. సెంట్రల్ వాటర్ కమిషన్ అంచనా ప్రకారం ఈనెల 23నుంచి వరద ఉద్ధృతి పెరిగే అవకాశం ఉందని బుధవారం వరకు వరద స్వల్పంగా పెరుగుతూ ప్రవహిస్తుందన్నారు. ఈ మేరకు విపత్తుల నిర్వహణ సంస్థ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. వరద తగ్గేవరకు గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర సహాయం అందించేందుకు ఒక ఎన్‌డిఆర్‌ఎఫ్, రెండు ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉంచినట్లు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. శనివారంరాత్రి 9 గంటలకు భద్రాచలం వద్ద నీటి మట్టం 41.4 అడుగులు ఉందని, ధవళేశ్వరం బ్యారేజీ ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 8.41లక్షల క్యూసెక్కులు ఉందని తెలిపారు. ఆదివారం నుంచి ధవళేశ్వరం వద్ద వరద పెరిగే అవకాశం ఉ ందని, కాటన్ బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద చేరే అవకాశం ఉందని తెలిపారు. విపత్తుల సంస్థ స్టేట్ కంట్రోల్ రూమ్ నుంచి వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సంబంధిత జిల్లాల యంత్రాంగానికి సూచనలు జారీ చేస్తామని పేర్కొన్నారు.

ఆర్టీసీలో ప్రోటోకాల్ రగడ

- సమావేశాలకు పిలవడం లేదంటున్న డైరెక్టర్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆర్టీసీలో నామినేటెడ్ పోస్టుల్లో ఉన్న డైరెక్టర్లకు, అదే శాఖలో అధికారులకు మధ్య అంతర్గత వార్ జరుగుతోంది. బోర్డు సమావేశాల్లో తమకు ప్రాతినధ్యం కల్పించడం లేదని డైరెక్టర్లు ఆరోపిస్తుండగా, కొన్ని అంతర్గత భేటీలకు ఆహ్వానించాల్సిన అవసరం లేదని అధికారులు అంటున్నారు. దీనిపై రాష్ట్ర స్థాయి బోర్డులో కూడా ప్రత్యేకంగా చర్చించనున్నారు.

రాష్ట్ర స్థాయి, జోనల్ స్థాయి, జిల్లా స్థాయిల్లోని ఆర్టీసీ బోర్డుల్లో అనేక మంది డైరెక్టర్లుగా పనిచేస్తున్నారు. ప్రతి బోర్డు సమావేశాల్లో, కీలక నిర్ణయాలు తీసుకునే భేటీల్లో బోర్డు సభ్యులకు ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉంటుంది. కొన్ని అంశాల్లో నిర్ణయాధికారం లేకపోయినా బోర్డు సభ్యులకు గౌరవం కల్పించాల్సి ఉంటుంది. అయితే జోనల్, జిల్లా స్థాయి బోర్డుల్లో తమకు ప్రాధాన్యత లభించడం లేదని అనేక మంది బోర్డు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ భేటీలకు కనీసం తమను ఆహ్వానించడం లేదని ఆయా స్థాయి బోర్డు డైరెక్టర్లు అంటున్నారు. ఈ భేటీలకు సంబంధించి తాము సూచించిన అంశాలను అధికారులు పట్టించుకోవడం లేదని, కనీసం సమాధానాలు కూడా రావడం లేదని వారు చెబుతున్నారు. తాము ఇస్తున్న సూచనలు సంస్థ పనితీరు మెరుగుదల, ప్రజలు, ప్రయాణికుల సౌకర్యం వంటి అంశాలకు సంబంధించినవేనని, వాటికిఅధికారులు సమాధానాలు చెప్పాల్సిన అవసరంకూడా ఉందంటున్నారు. . సంస్థ నిర్వహించే పలు కార్యక్రమాలు, శంకుస్థాపన వంటి వాటిల్లో నిబంధనలకు అనుగుణంగానే ప్రోటోకాల్ పాటించాల్సి ఉంటుందని,జోనల్, జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక నిర్ణయాలు తీసుకునే అవకాశం లేదని డైరక్టర్లు అంటున్నారు.వీటితో పాటు మరికొన్ని అంశాలపై కూడా వారు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఇవే అంశాలపై నేరుగా రాష్ట్ర స్థాయి చైర్మన్, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌లకు కొందరు లేఖలు రాశారు. అధికారులు మాత్రం. తాము నిర్వహించే సమావేశాల్లో కొన్ని అంతర్గత సమావేశాలుగా ఉంటాయని, వాటికి సభ్యులను ఆహ్వానించే పరిస్థితి ఉండదని చెబుతున్నారు. ప్రధానంగా సంస్థ పనితీరు (పర్ఫార్మెన్స్)పై జరిగే సమావేశాలు పూర్తిగా అధికారికమైనవని వారంటున్నారు. అయితే ఈ భేటీల్లో డైరెక్టర్ల నుంచి వచ్చే సూచనలను జోనల్, జిల్లా స్థాయిలో అధికారులు పరిగణనలోకి తీసుకోవచ్చునని ఉన్నతాధికారులు చెబుతున్నారు.



ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్

ఐటిడిఎ ఎపిఒపై ఎస్‌టి కమిషన్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శ్రీశైలం ఐటిడిఎ కార్యాలయంలో ఎపిఒ 15 ఏళ్లుగా అక్కడే విధులు నిర్వహిస్తున్నారని, చెంచుల అభివృద్ధిని పట్టించుకోవడం లేదని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఐటిడిఎ ఎపిఒగా పనిచేస్తున్న మురళీధర్‌ను విధుల్లోంచి తొలగించి చెంచుల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. 15 ఏళ్లుగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న ఎపిఒ చెంచులకు అందాల్సిన సంక్షేమ పథకాలను అందకుండా చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల ప్రభుత్వం బదిలీ చేసినా పలుకుబడితో నిలుపుదల చేయించుకున్నారని వివరించారు. పిఒలను మ్యానేజ్ చేస్తూ ఐటిడిఎకు నష్టం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై స్పందించి అతన్ని బదిలీ చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో రాష్ట్ర సహాయ కార్యదర్శి రవినాయక్, ఉత్తరాంధ్ర నాయకులు లోవరాజు, హనుమంతునాయక్, విక్రమ్‌నాయక్ ఉన్నారు.

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న ట్యాంకర్

మొదటి పేజీ తరువాయి

రాజంపేట-తిరుపతి జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. ఘటనా స్థలికి పోలీసులు చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఓబులవారిపల్లె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం

రోడ్డు ప్రమాదంలో చనిపోయిన నలుగురి కుటుంబాలకూ రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీష ప్రకటించారు. తీవ్రగాయాలైన వారికి రూ.2 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి రూ.50 వేలు చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. గాయపడిన వారికి ఆర్‌టిసి తరుపున ఉచితంగా వైద్యం అందించనున్నట్లు చెప్పారు.

బస్సు ప్రమాదంపై చంద్రబాబు విచారం

ఈ ప్రమాదంపై టిడిపి అధినేత చంద్రబాబునాయుడు విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా బాధించిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నిలకడగా గోదావరి

- భద్రాచలం వద్ద తగ్గుముఖం
- ఊపిరి పీల్చుకున్న లంక వాసులు

ప్రజాశక్తి - యంత్రాంగం

రెండు రోజుల పాటు ఉధృతంగా ప్రవహించిన గోదావరి ప్రవాహం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద ప్రస్తుతం నిలకడగా ఉంది. భద్రాచలంలో వరద తగ్గుముఖం పట్టింది. శనివారం రాత్రికి 40.70 అడుగుల నీటి మట్టం నమోదైంది. పోలవరం వద్ద నీటి మట్టం క్రమంగా తగ్గి.. 30.10 మీటర్లకు చేరింది. ఇదే సమయంలో ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద ప్రస్తుతం 10.70 అడుగులకు నీటి ప్రవాహం చేరుకుంది. దీంతో బ్యారేజీకి చెందిన 175 గేట్లను 0.4 మీటర్ల మేర పైకెత్తి 8,43,684 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. రానున్న 24 గంటల్లో వరద మరింత తగ్గుముఖం పడుతుందని ఇరిగేషన్ అధికారులు భావిస్తున్నారు. ఈ వరద తగ్గుముఖం పట్టడంతో లంకప్రాంత వాసులు ఊపిరిపీల్చుకున్నారు.

ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోని కుక్కునూరు-దాచారం మధ్య కాజ్‌వే వరద ముంచెత్తడంతో 14 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో 48 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. 27 మంది గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో రెండు రోజులు ఉధృతంగా ప్రవహించిన వశిష్ట గోదావరి శాంతించింది. పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం పుష్కర ఘాట్ల వద్ద గోదావరి తగ్గుముఖం పట్టి రెండు అడుగుల మేర నీరు తగ్గింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా శ్రీరామసాగర్, ఏటూరు నాగారం, పేరూరు ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేయడంతో భద్రాచలం వద్ద నీటి మట్టం పెరుగుతూ వస్తోంది. ఈ వరద ఇంకా పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. సహాయక చర్యల కోసం మర పడవలు, లాంచీలు సిద్ధం చేశామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా వి.ఆర్.పురం మండలం సున్నివారి వెంకన్నగూడెం, చింతరేవుపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కూనవరం మండలంలోని పలు ప్రాంతాల్లో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్ పర్యటించారు. పునరావాస కేంద్రాలను పెంచాలని, టేకులబోరు - కొండ్రాజుపేట మధ్య పడవ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ధవళేశ్వరంలో కాటన్ బ్యారేజీ వద్ద వరదనీటి ప్రవాహం

ఉపా చట్టం కింద దుడ్డు ప్రభాకర్ అరెస్టు

హైకోర్టుకు తెలిపిన ఎన్ఐఎ

ప్రజాశక్తి-అమరావతి

కుల నిర్మూలన పోరాట సమితి నేత దుడ్డు ప్రభాకర్‌ను అరెస్టు చేసినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) హైకోర్టుకు తెలిపింది. చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద అరెస్టు చేసినట్లు చెప్పింది. ఛత్తీస్‌గఢ్, జగదల్‌పూర్ కోర్టులో హాజరుపర్చిన విషయాన్ని కూడా విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్ పోలీసులకు తెలియజేశామని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని జస్టిస్ డివిఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ దుప్పల వెంకటరమణతో కూడిన డివిజన్ బెంచ్‌కు ఎన్ఐఎ తరుపున న్యాయవాది శనివారం నివేదించారు. తన భర్త ప్రభాకర్‌ను ఎన్ఐఎ అధికారులు అక్రమంగా అదుపులోకి తీసుకున్నారంటూ ఆయన భార్య దుడ్డు కుసుమ కుమారి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ ఈ నెల 27కు వాయిదా పడింది. ఈలోగా ఎన్ఐఎ, రాష్ట్ర పోలీసులు కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులిచ్చింది. ఈ నెల 10న పది మంది సాధారణ వ్యక్తులు వచ్చి ప్రభాకర్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకుపోయారని పిటిషనర్ తరుపున న్యాయవాది జై భీమారావు వాదించారు. ప్రభాకర్ అరెస్టు గురించి పిటిషనర్‌కు గానీ, పోలీసులకు గానీ ఏవిధమైన సమాచారం ఇవ్వలేదన్నారు.

ప్రతి రైతూ శాస్త్రవేత్తే

- వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వ్యవసాయం చేసే ప్రతి రైతునూ శాస్త్రవేత్తను చేయాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దేశంలోనే మొదటిసారిగా పులివెందులలోని ఎపి కార్ల్‌లో రైతు శాస్త్రవేత్త శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎపి కార్ల్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతన్న సుభిక్షంగా ఉండాలని సిఎం ఎన్నో పథకాలను తీసుకువచ్చి వారికి అండగా నిలుస్తున్నారని చెప్పారు. కోట్ల ఆస్తులున్నా మంచి ఆరోగ్యం లేకపోతే దేన్నీ అనుభవించలేమనే నిజాన్ని ఉదహరణలతో వివరించారు. ప్రకృతి వ్యవసాయంపై సంపూర్ణ అవగాహన కోసం తయారు చేసిన మాడ్యుల్స్‌ను తరగతి గదుల్లో బోధిస్తామని చెప్పారు. అంతకుముందు ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి స్టాల్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మంత్రి పరిశీలించారు. ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన డ్రిప్ పరికరాలను, రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన రైతు పరిశోధన కోర్సు అకాడమిక్ మొదటి బ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర ఉద్యాన సలహాదారు పి.శివ ప్రసాద్‌రెడ్డి, జెసి జి.గణేష్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్
CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS ◆ DEPOSITS Translating Dreams into Reality
బ్రాంచి చిరునామా : 40-5-19/17, 1వ అంతస్తు, సిద్ధార్థ కాలేజి బస్టాప్ దగ్గర, మొగల్‌రాజపురం, విజయవాడ - 520010. ఫోన్ : 0866-2474781 / 2481731. సెల్ : 7625079119
Email: vijaywada@canfinhomes.com. CIN:L8511OKA1987PLC008699

స్వాధీనత ప్రకటన
(for immovable property) [(Rule 8(1)]

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 అండ్ సదరు చట్టం అధికారాలు అధ్యాయనం చేస్తూ మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 క్రింద కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారుడు **ఋణగ్రహీతలు శ్రీ కట్టా రమేష్‌బాబు (లేటు) మరియు శ్రీ కట్టా నాగేశ్వరరావు** తండ్రి : లేటు కట్టా రమేష్‌బాబు, **శ్రీమతి కట్టా ఆదిలక్ష్మి** భర్త : లేటు కట్టా రమేష్‌బాబు (హామీదారు) గార్లు సదరు నోటీసు యొక్క తేది నుండి 60 రోజులలోగా **రూ. 15,23,696/- (అక్షరాలా పదిహేను లక్షల ఇరవై మూడు వేల ఆరు వందల తొంభై ఆరు రూపాయలు మాత్రమే)** మరియు తదుపరి వడ్డీ మరియు వ్యయాలతో కలిపి నోటీసులో పేర్కొన్న మొత్తం తిరిగిచెల్లించమని కోరుతూ **15-05-2023న డిమాండ్ నోటీసు** జారీచేయబడింది.

ఋణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనారు, ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వడమేమనగా **20-07-2023**న సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ యొక్క రూల్ నెం. 8(1)తో చదువుతూ సెక్షన్ 13 (4) క్రింద వారిచే అధికారాలు నిర్ణయించి అధ్యాయనం చేసి కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్‌కి తనఖా చేసిన ఆస్తి దిగువ సంతకందారు స్వాధీనం చేసుకోవడమైనది. సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు మీకు అందుబాటులో ఉన్న సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలు ఆహ్వానించడమైనదని ఋణగ్రహీతలు శ్రద్ధ వహించ వలసిందిగా కోరుతున్నాము.

ప్రత్యేకంగా ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమేమనగా ఆస్తిలో లావాదేవీలు జరుపకూడదు, ఆస్తితో జరిపే లావాదేవీలేవైనా మొత్తం **రూ. 15,23,696/-** మరియు వర్తించే తదుపరి వడ్డీ మరియు తెలిసినంత మేరకు దానిపిమ్మట వ్యయం కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్, విజయవాడ యొక్క ఛార్జికు లోబడి ఉండవలెను.

తనఖా ఆస్తి షెడ్యూలు

గుంటూరు జిల్లా, మంగళగిరి మున్సిపాలిటీ, మంగళగిరి సబ్ రిజిస్ట్రార్, మంగళగిరి గ్రామం, ఆర్.ఎస్.నెం. 234, 236/1, 5వ వార్డు, అసెస్ట్ నెం. 1023008115, డి.నెం. 5-337/సి వద్ద 71.6 చ॥గ॥లు (59.95 చ॥మీ॥) విస్తీర్ణంలోని స్థలము అందలి నివాస ఇల్లు దానికి చెందిన అన్ని హక్కులతో సహా. **హద్దులు : తూర్పు** : కోడూరు శ్రీనివాసరావు, **దక్షిణం** : కట్టా కనకదుర్గా గారి ఆస్తి, **పడమర** : మున్సిపల్ బజారు, **ఉత్తరం** : కట్టా అజయ్ బాబు గారి ఆస్తి.

సం/-
తేది : 22-07-2023 — అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ — కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

మణిపూర్ హత్యాకాండకు మోడీ విధానాలే కారణం

- హింసను నిరసిస్తూ ఐద్వా, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

మణిపూర్ రాష్ట్రంలో మైనార్టీలపై జరుగుతున్న హింస, హత్యాకాండను నిరసిస్తూ పలు జిల్లాల్లో ఐద్వా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసనలు తెలిపారు. మతం ముసుగులో కొందరు హిందూత్వ వాదులు మైనార్టీ మహిళలను చెరబడుతున్న తీరు భరత జాతికే కళంకమని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ హత్యాకాండకు మోడీ విధానాలే కారణమని ధ్వజమెత్తారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం, గిరిజన మహిళా సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసనలు మిన్నంటాయి. అరకు వ్యాలీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో చేపట్టారు. హుకుంపేట, ముంచంగిపుట్టు, పెదబయలు మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. డుంబ్రిగుడ మండలం సాగర పంచాయతీ అడపవలసలో గిరిజనులు ఆందోళన చేపట్టారు. అనకాపల్లి జిల్లా పరవాడ, చోడవరంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మణిపూర్ ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలని పెద్దపెట్టున నినదించారు. తిరుపతి జిల్లా పాకాలలో స్థానిక అంబేద్కర్ భవన్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ అల్లర్లను శ్రీకాళహస్తి పాస్టర్ అసోసియేషన్ నాయకులు తీవ్రంగా ఖండించారు. రేణిగుంట, గూడూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతపురంలో మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చర్చావేదికను నిర్వహించారు. బిజెపి పాలనా నిర్లక్ష్య వైఫల్యంతోనే దేశంలో ఇలాంటి దారుణ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప అంబేద్కర్ కూడలిలో అఖిలపక్ష నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో అంగన్వాడీలు నల్లబ్యాడ్జీలతో, ఓబులవారిపల్లెలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ పాల్గొన్నారు.కాకినాడ జిల్లా కేంద్రంలో సుందరయ్య భవన్ నుంచి ఇంద్రపాలెం వంతెన, జిల్లా కలెక్టర్ కార్యాలయం మీదుగా జిల్లా పరిషత్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరంలో ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. కొవ్వూరు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద పౌరహక్కుల సంఘం ఆధ్వర్యాన నిరసన తెలిపారు.

అరకులోయలో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు

విశాఖలో దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ రంగ సంస్థల సమావేశం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖలో దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ రంగ సంస్థల (సదరన్ రీజనల్ పవర్ కమిటీ) 47వ సమావేశం శుక్ర, శనివారాల్లో రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగింది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దక్షిణాది రాష్ట్రాలలో విద్యుత్ రంగ అభివృద్ధిపై ఎపి పవర్ యుటిలిటీస్ (ఎపి ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్‌లు) ఆతిథ్యంలో ఈ సమావేశం సాగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఎపి ట్రాన్స్‌కో సిఎమ్‌డి, కమిటీ ప్రస్తుత చైర్మన్ కె.విజయానంద్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఎస్ఆర్‌పిసి మెంబర్ సెక్రటరీ అసిత్‌సింగ్, ఎస్ఆర్ఎల్‌డిపి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి.కుమార్, ఎపి జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కెవిఎన్.చక్రధర్ బాబు, ఎపి విద్యుత్ పంపిణీ సంస్థల సిఎమ్‌డిలు పృధ్వీరాజ్, కె.సంతోష్‌రావు, జె.పద్మజనార్ధనరెడ్డి, ఎస్ఆర్‌పిసి ఉన్నతాధికారులు, దక్షిణాది నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరికి చెందిన విద్యుత్ రంగ సంస్థలు, పిజిసిఐఎల్, సిటియుఐఎల్ సంస్థలు, ఎన్‌టిపిసి, ఎన్ఐసిఐఎల్, ఎన్‌పిసిఐఎల్, హెచ్ఎన్‌పిసిఎల్, జిఇఇఎస్‌కో, ఎస్ఇఐఎల్ వంటి జనరేటింగ్ కంపెనీలు పాల్గొన్నాయి. దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ రంగ సంస్థల నిర్వహణ, వాణిజ్యపరమైన కార్యకలాపాలు, సాధారణ సమస్యలపై దృష్టి సారించి పరస్పరం సహకరించుకొనేందుకు అవసరమైన సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకొనేందుకు ఈ సమావేశం వేదికగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. దక్షిణ గ్రిడ్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎస్ఆర్‌పిసి, ఎస్ఆర్ఎల్‌డిసి సంస్థల నుంచి అవసరమైన సలహాలు పొందేందుకు తోడ్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఎపి ఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృధ్వీతేజ్ ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ రంగ అభివృద్ధికి అమలు చేస్తున్న కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు.

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్
CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS ◆ DEPOSITS Translating Dreams into Reality
బ్రాంచి చిరునామా : 40-5-19/17, 1వ అంతస్తు, సిద్ధార్థ కాలేజి బస్టాప్ దగ్గర, మొగల్‌రాజపురం, విజయవాడ - 520010. ఫోన్ : 0866-2474781 / 2481731. సెల్ : 7625079119
Email: vijaywada@canfinhomes.com. CIN:L8511OKA1987PLC008699

స్వాధీనత ప్రకటన
(for immovable property) [(Rule 8(1)]

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 అండ్ సదరు చట్టం అధికారాలు అధ్యాయనం చేస్తూ మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 క్రింద కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారుడు **ఋణగ్రహీతలు శ్రీ డి. జగదీష్ కుమార్** తండ్రి : రామకృష్ణారావు దేవులపల్లి **మరియు శ్రీమతి దేవులపల్లి ప్రత్యూష** భర్త : డి. జగదీష్ కుమార్, **శ్రీ జి. విష్ణు కిషోర్** తండ్రి : జి. వెంకటేశ్వర్లు (హామీదారు) గార్లు సదరు నోటీసు యొక్క తేది నుండి 60 రోజులలోగా **రూ. 17,34,922/- (అక్షరాలా పదిహేడు లక్షల ముప్పై నాలుగు వేల తొమ్మిది వందల ఇరవై రెండు రూపాయలు మాత్రమే)** మరియు తదుపరి వడ్డీ మరియు వ్యయాలతో కలిపి నోటీసులో పేర్కొన్న మొత్తం తిరిగి చెల్లించమని కోరుతూ **15-05-2023న డిమాండ్ నోటీసు** జారీచేయబడింది.

ఋణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనారు, ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వడమేమనగా **20-07-2023**న సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ యొక్క రూల్ నెం. 8(1)తో చదువుతూ సెక్షన్ 13 (4) క్రింద వారిచే అధికారాలు నిర్ణయించి అధ్యాయనం చేసి కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్‌కి తనఖా చేసిన ఆస్తి దిగువ సంతకందారు స్వాధీనం చేసుకోవడమైనది. సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు మీకు అందుబాటులో ఉన్న సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలు ఆహ్వానించడమైనదని ఋణగ్రహీతలు శ్రద్ధ వహించ వలసిందిగా కోరుతున్నాము.

ప్రత్యేకంగా ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమేమనగా ఆస్తిలో లావాదేవీలు జరుపకూడదు, ఆస్తితో జరిపే లావాదేవీలేవైనా మొత్తం **రూ. 17,34,922/-** మరియు వర్తించే తదుపరి వడ్డీ మరియు తెలిసినంత మేరకు దానిపిమ్మట వ్యయం కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్, విజయవాడ యొక్క ఛార్జికు లోబడి ఉండవలెను.

తనఖా ఆస్తి షెడ్యూలు

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ, పటమట సబ్ రిజిస్ట్రార్, పెనమలూరు మండలం, యనమలకుదురు గ్రామం & పంచాయితీ, ఆర్.ఎస్.నెం. 5/2 వద్ద మొత్తం 322.08 చ॥గ॥లు (269.29 చ॥మీ॥) ల విస్తీర్ణంలో నిర్మించిన కిర్తి టవర్స్ అపార్ట్‌మెంట్ నందు అవిభక్త వాటా 25 చ॥గ॥లు (20.09 చ॥మీ॥) విస్తీర్ణంలో గల స్థలము అందలి 800 చ॥అ॥ల ప్లింత్ ఏరియా, 150 చ॥అ॥ల కామన్ ఏరియా, 25 చ॥అ॥ల పార్కింగ్ ఏరియాతో బ్లాక్ నెం. 1 నందు గ్రౌండ్ ఫ్లోర్‌లో గల ఫ్లాట్ నెం. జిఎఫ్-1కి చెందిన స్థలము మరియు నివాస ఫ్లాట్‌తో సహా. **స్థలమునకు హద్దులు : తూర్పు** : 15 అ॥ వెడల్పు రోడ్డు, **దక్షిణం** : మాటూరి వెంకట రమణమ్మ (కీర్తి టవర్స్ బ్లాక్ నెం. 2) గారి ఆస్తి, **పడమర** : కటారి కామేశ్వరరావు గారి ఆస్తి, **ఉత్తరం** : మరీదు నాగేశ్వరరావు గారి ఆస్తి మరియు 24 అ॥ వెడల్పు గల రోడ్డు. **ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు** : పార్కింగ్, **దక్షిణం** : కీర్తి టవర్స్ బ్లాక్ నెం. 2, **పడమర** : గోకులం రెసిడెన్సీ, **ఉత్తరం** : ఈ ఫ్లాట్‌కి మరియు ఫ్లాట్ నెం. జిఎఫ్-2కి మధ్య కామన్ గోడ

సం/-
తేది : 22-07-2023 — అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ — కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

'అదానీ' పై ఉధృత ఆందోళన

- బిజెపియేతర రాజకీయ పార్టీలు, అఖిలపక్ష కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్ణయం
- అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిందే

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బిజెపియేతర రాజకీయ పార్టీలు, అఖిలపక్ష కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. కార్మికుల సమస్యలపై ఈ నెల 24న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని, ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాన్ని ఉధృతం చేయాలని తీర్మానించింది. విశాఖలోని జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి ఎమ్‌డి.నజీర్, సిపిఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) జిల్లా కార్యదర్శి వై.కొండయ్య, ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ ఇ.చంద్రశేఖర్, సిపిఐ (ఎంఎల్) ప్రజాపోరు జిల్లా నాయకులు కె.దేవా, లోక్‌సత్తా జిల్లా నాయకులు జి.సుధీర్ కుమార్, ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి కె.శంకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గంగవరం పోర్టు కార్మికుల పోరాటం న్యాయసమ్మతమైనదని, ఇందుకు విశాఖ జిల్లా అఖిలపక్ష రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు సంపూర్ణ మద్దతునిస్తున్నాయని తెలిపారు. పోర్టు నిర్మాణానికి నిర్వాసితులు తమ ఇళ్లను, భూములను, సముద్ర వేట, ఉపాధిని త్యాగం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పోర్టు వస్తే తమకు శాశ్వత ఉపాధి లభించి జీవితాలు బాగుపడతాయని భావించిన నిర్వాసితులకు నిరాశే ఎదురైందన్నారు. ప్రాధాన్యత లేని ఉద్యోగాలను నిర్వాసితులకు ఇచ్చిందని, పర్మినెంటు కార్మికులకిచ్చే జీతాలు ఇస్తామని చెప్పి జిపిఎల్, జిపిఎస్ కార్మికుల పేరుతో అతి తక్కువ జీతాలతో దోపిడీ చేస్తోందని మండిపడ్డారు. 14 సంవత్సరాలకుపైగా పని చేస్తున్న కార్మికులకు నెలకు రూ.13 వేలు నుంచి 16 వేలు మాత్రమే చెల్లింస్తోందన్నారు. ఉద్యోగంలో చేరే సమయానికి ఉన్న రూ.3,700 బేసిక్‌నే ఇప్పటికీ కొనసాగించడం యాజమాన్య దోపిడీకి నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పడాల రమణ, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, పాల్గొన్న పలు పార్టీల, కార్మిక సంఘాల నాయకులు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

న్యాయస్థానంపై నమ్మకం ఉంది

'వివేకా' కేసులో టిటిడి చైర్మన్ వైవి. సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో న్యాయస్థానంపై తమకు నమ్మకం ఉందని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన ఆయన తాళ్లరేవు మండలం పిల్లంకలో శనివారం మీడియాతో మాట్లాడారు. వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో కోర్టులను సిబిఐ తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్‌పై వ్యక్తిగత దాడికి దిగడం ప్రతిపక్షాలకు తగదన్నారు. ఈ కేసులో ముందు నుంచీ కోర్టులను తప్పుదావ పట్టించేలా సిబిఐ విచారణ ఉందని ఆరోపించారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా న్యాయం తమ వైపే ఉందని అన్నారు. పొత్తుల కోసం ప్రతిపక్ష పార్టీలు వెంపర్లాడుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో చేసిన అభివృద్ధి, సంక్షేమంపై నమ్మకంతో తాము సింగిల్‌గానే పోటీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిటిడి తరపున వాదించేందుకు మాజీ ఎంపి సుబ్రమణ్యస్వామికి అనుమతి

ప్రజాశక్తి-అమరావతి

టిటిడిలో అన్యమత ప్రచారం జరుగుతోందంటూ 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక తప్పుడు కథనం రాసిందనే పరువు నష్టం కేసులో టిటిడి తరపున వాదించేందుకు రాజ్యసభ మాజీ సభ్యులు సుబ్రమణ్యస్వామికి అనుమతి లభించింది. ఈ మేరకు తిరుపతి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేయాలంటూ 'ఆంధ్రజ్యోతి' యాజమాన్యం దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది. ఈ మేరకు జస్టిస్ బిఎస్ భానుమతి ఉత్తర్వులు జారీ చేశారు.

పిఎస్‌బిలకు రికార్డ్ లాభాలు

- ప్రధాని మోడీ వెల్లడి

ముంబయి : ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు (పిఎస్‌బి) ఒకప్పుడు భారీ నష్టాలు, ఎన్‌పిఎల్లో ఉండగా.. ప్రస్తుతం రికార్డ్ లాభాలను నమోదు చేస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. యుపిఎ హయంలో స్కామ్‌లతో బ్యాంకింగ్ రంగాన్ని నాశనం చేశారన్నారు. ప్రస్తుతం బ్యాంక్‌లు ఆరోగ్యకరంగా మారాయన్నారు. వర్చువల్‌గా 70,000 మందికి పైగా నియామకాల లేఖలను అందించిన తర్వాత రోజ్‌గార్ మేళాను ఉద్దేశించి మోడీ మాట్లాడారు. తమ హయంలో పెద్ద సంఖ్యలో బ్యాంకింగ్ రంగంలో ఉపాధి పొందారన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ వెన్ను విరిచేలా గత ప్రభుత్వ హయాంలో బ్యాంకింగ్ కుంభకోణాలు జరిగాయన్నారు. కొంతమంది శక్తివంతమైన నాయకులు, కుటుంబాలకు ఇష్టమైన వారికి వేల కోట్ల రూపాయల రుణాలు ఇచ్చారన్నారు. ఆ రుణాలు ఎప్పటికీ తిరిగి చెల్లించబడవని అన్నారు. తమ ప్రభుత్వం, బ్యాంకుల నిర్వహణను బలోపేతం చేయడం, చిన్న బ్యాంకులను విలీనం చేయడం తదితర చర్యలు చేపట్టిందన్నారు. ముద్ర పథకం కింద పేదలు, అసంఘటిత రంగాలకు రుణాల ద్వారా సహాయం చేయడానికి, మహిళా స్వయం సహాయక బృందాలకు మద్దతు ఇవ్వడానికి బ్యాంకింగ్ రంగ ఉద్యోగులు కష్టపడి, ప్రజలకు సేవ చేయడంలో నిబద్ధతతో పని చేస్తున్నారని అన్నారు.

'పాడి' ఉత్పత్తులతో అధికాదాయం

ఎస్‌వి వెటర్నరీ వర్సిటీ 12వ స్నాతకోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - క్యాంపస్ (తిరుపతి)

పశువైద్య విద్యార్థులు నిస్వార్థంతో సమాజ సేవలో భాగస్వాములు కావాలని, వ్యవసాయ రైతులకు అనుబంధంగా ఉండే పాడిపరిశ్రమ ఉత్పత్తులతో అధిక ఆదాయం పొందేలా రైతులకు సహాయ సహకారాలు అందించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్, కేరళ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ఎంఆర్ శశీంద్రనాథ్ ఉద్ఘాటించారు. భవిష్యత్‌ను మార్చేశక్తి యువతలో ఉందని, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు.

శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవాన్ని శనివారం ఎస్‌వి యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. కాన్వొకేషన్ రిపోర్టును ఎస్‌వి యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.పద్మనాభరెడ్డి సమర్పించారు. ఈ సందర్భంగా పద్మనాభరెడ్డి మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ స్థాయిలో నేర్చుకున్న వృత్తిని గౌరవంగా, నీతిసూత్రాలకు అనుగుణంగా వృత్తిపరమైన జ్ఞానం, నిరంతర సమాజ అభివృద్ధిని జీవితకాల బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. దేశంలోని మహిళలకు దాదాపు 50శాతం పాడిపరిశ్రమ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని కల్పిస్తోందన్నారు. భారతదేశం అత్యధిక పాల ఉత్పత్తిదారుగానూ, గుడ్ల ఉత్పత్తిలో మూడో స్థానంలో, మాంసం ఉత్పత్తిలో ఆరో స్థానంలో ఉందని తెలిపారు. 2023లో వేంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో 31వ స్థానంలో నిలిచిందని చెప్పారు. ఈ స్నాతకోత్సవంలో 222 బివిఎస్‌సి, 37 బి.టెక్ (డెయిరీ టెక్నాలజీ), 102 పిజి, ఐదు పిహెచ్‌డి డిగ్రీలతో పాటు ప్రతిభ కనబరచిన విద్యార్థినీ, విద్యార్థులకు 35 బంగారు పతకాలు, రెండు రజత పతకాలు, ఒక క్యాష్ బహుమతి, అధ్యాపకులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రవి, రీసెర్చ్ డీన్ ఆచార్య సర్జన్‌రెడ్డి, మాజీ డీన్లు ఆచార్య చంద్రశేఖరరావు, ఆచార్య సూర్యనారాయణ, ఆచార్య సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి పట్టాను ప్రదానం చేస్తున్న గవర్నర్

పురుగులమందు తాగిన జీడి రైతు మృతి

- అప్పుల బాధతో ఆత్మహత్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆరుగాలం పండించిన జీడి పంటకు గిట్టుబాటు ధర రాక మూడేళ్లుగా చేసిన అప్పులు తీర్చలేని స్థితిలో ఐదు రోజుల క్రితం పురుగులమందు తాగిన శ్రీకాకుళం జిల్లా పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన జీడి రైతు సైని సింహాచలం (60) శనివారం మృతి చెందారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడి చివరకు కన్నుమూశారు. రిమ్స్‌లో సింహాచలం బంధువులను ఆంధ్రప్రదేశ్ జీడిరైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు ఓదార్చారు. మృతుని కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని, జీడి రైతులను ఆదుకునేందుకు ఆర్‌బికెల ద్వారా జీడి పిక్కలను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింహాచలం ఆత్మహత్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరే కారణమని విమర్శించారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని, పరిశ్రమల యజమానులు నిర్ణయించిన ధరకే రైతులు జీడి పిక్కలను అమ్ముకోవాల్సిన దుస్థితి ఉందని అన్నారు. గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నా ప్రభుత్వం, జీడి పరిశ్రమల యాజమాన్యాలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. పైగా, జీడి పరిశ్రమలను అర్ధాంతరంగా మూసివేసి రైతులను, కార్మికులను రోడ్డున పడేయం దారుణమని పేర్కొన్నారు.



మృతుడు సింహాచలం (ఫైల్ ఫోటో)

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
పోరంకి బ్రాంచి
టివిఆర్ కాలనీ, పోరంకి, విజయవాడ.
కృష్ణా జిల్లా. ఆంధ్రప్రదేశ్ - 521137

ఈ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పోరంకి శాఖ** అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు నోటీసు ఇచ్చి తెలియజేయునదిఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జిలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి **అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదిన** దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతల నుండి రావలసిన **బకాయి మొత్తము రూ. 26,59,110.03 /- (అక్షరాలా ఇరవై ఆరు లక్షల యాభై తొమ్మిది వేల నూట పది రూపాయల మూడు పైసలు మాత్రమే)** (నోటీసు తరువాత రికవరీ చేయబడిన మొత్తాన్ని తీసివేయాలి) తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పోరంకి శాఖ వారిచే** ఇ-వేలం అమ్మకం ద్వారా **ది. 10-08-2023న** ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. బిడ్లు సమర్పించుటకు ఆఖరు తేది : ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు

ఋణగ్రహీత / హామీదారుల వివరములు : 1) శ్రీ కర్నాటి దుర్గారావు (అప్లికెంట్), తండ్రి : రాఘవులు, డోర్ నెం. 76-8/1-12/2, టెలిఫోన్ కాలనీ, భవానీపురం, విజయవాడ - 520012. **2) శ్రీమతి కర్నాటి పుష్ప,** (సహ ఋణగ్రహీత), భర్త : కర్నాటి దుర్గారావు, డోర్ నెం. 76-8/1-12/2, టెలిఫోన్ కాలనీ, భవానీపురం, విజయవాడ - 520012. **3) శ్రీ కర్నాటి దుర్గారావు (అప్లికెంట్),** తండ్రి : రాఘవులు, డోర్ నెం. 115/సి, (దగ్గరి డోర్ నెం. 3-456), ఉండవల్లి జామాయిల్ తోట రోడ్డు, ఫస్ట్ ఫ్లోర్ బిల్డింగ్, ఉండవల్లి గ్రామం, ఉండవల్లి మండలం, ఎస్ఆర్ఓ, గుంటూరు జిల్లా. **4) శ్రీమతి కర్నాటి పుష్ప,** (సహ ఋణగ్రహీత), భర్త : కర్నాటి దుర్గారావు, డోర్ నెం. 115/సి, (దగ్గరి డోర్ నెం. 3-456), ఉండవల్లి జామాయిల్ తోట రోడ్డు, ఫస్ట్ ఫ్లోర్ బిల్డింగ్, ఉండవల్లి గ్రామం, ఉండవల్లి మండలం, ఎస్ఆర్ఓ, గుంటూరు జిల్లా.

స్థిరాస్తి వివరములు

గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రార్, ఉండవల్లి గ్రామం & పంచాయితీ, ఉండవల్లి జామ ఆయిల్ తోట రోడ్డు, డి.నెం. 115/సి, దగ్గరి డి.నెం. 3-456 వద్ద మొత్తం 103.685 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలము నందు అవిభక్త లేదా పేర్కొనబడని వాటా 51.84 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఇంటి స్థలము అందలి ఫస్ట్ ఫ్లోర్ ఆర్‌సిసి నివాస భవనం. **హద్దులు : తూర్పు** : విక్రేతలకు చెందిన ఆస్తి, **దక్షిణం** : విక్రేతలకు చెందిన ఆస్తి, **పడమర** : మున్నంగి ప్రకాష్ రెడ్డి మరియు ఇతరులకు చెందిన ఆస్తి, **ఉత్తరం** : 18 అ॥ వెడల్పు గల జాయింట్ రోడ్డు.

రిజర్వుధర (రూ.) : 25,50,000/- ధరావత్తు ధర (రూ.) : రూ. 2,55,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://www.ibapi.in మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వెబ్ సైట్ : **www.unionbankofindia.co.in** నందు చూడగలరు. అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేది నందు అధీకృత అధికారి **మొబైల్ నెం. 94913 70200, Mail ID: UBIN0533009@unionbankofindia.bank** లలో సంప్రదించవచ్చు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు
చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత / సహబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6) రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 20-07-2023 — సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్,
ప్రదేశం : పోరంకి — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పోరంకి శాఖ

సంపాదకీయం

అమ్మా...నాన్న..!

ప్రతి జీవికి పునరుత్పత్తి ఒక లక్షణం. మానవ పునరుత్పత్తిలో తల్లిదండ్రుల నుంచి ఉద్భవించిన జీవ ప్రక్రియే ఈ సమాజం. 'లోకమందు మాతాపితలు మిత్రుండును వీరు ముమ్వురే హితులు' అంటాడు చిన్నయసూరి తన 'మిత్రలాభము'లో. తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు, తల్లిదండ్రుల పట్ల పిల్లలు చూపే ప్రేమానురాగాలు... అచంచలమైన, నిస్వార్థమైన అనుబంధం...అదే రక్తసంబంధంలోని మాధుర్యం. తల్లిదండ్రుల ప్రేమను ఈ విశ్వంలో ఎవరూ భర్తీ చేయలేరు. తమ పిల్లలకు ఎంత వయసు వచ్చినా, ఎంత ఎత్తుకు ఎదిగినా... అమ్మానాన్నకు చిన్నపిల్లల్లానే కనిపిస్తారు. 'అమృతం దొరికితే పంచుకునేవాళ్లు దేవతలు/ అదే అమృతం దొరికితే పిల్లలకు పంచిపెట్టేవాళ్లు అమ్మానాన్నలు' అంటాడో కవి. అమ్మ ఈ ప్రపంచంలోకి తీసుకొస్తే...నాన్న ఈ ప్రపంచాన్ని పరిచయం చేస్తాడు. అమ్మ చంకనెత్తుకొని 'చందమామ రావె...జాబిల్లి రావె' అని గోరుముద్దలు పెడితే, తన వీపుమీద అంబారీ ఎక్కించుకొని ఆనందపడతాడు నాన్న. తమ ఆశలను తమ బిడ్డల ద్వారా నెరవేర్చుకోవాలనుకుంటారు. దానికోసం ఎంత కష్టమైనా భరిస్తారు. చివరకు పస్తులుండి కూడా... బిడ్డల కడుపు నింపుతారు. తమ ఆశలకు ప్రతిరూపాలుగా... తమ కలలకు ప్రతిబింబాలుగా చూసుకుంటారు. అలాంటి తల్లిదండ్రులను వద్ధాప్యంలో మరొక బాల్యాన్ని అందించాల్సిన బాధ్యత వారి పిల్లలది.

ఈ ఆధునిక యుగంలో ఆశల తీరాల వెంట పరుగులెడుతున్న పిల్లలతో కలిసి వుండలేని పరిస్థితి కూడా కొందరు తల్లిదండ్రులకు ఎదురవుతుంటుంది. సొంత ఊరులోనో, సొంత రాష్ట్రంలోనో ఉపాధి దొరక్క... పక్క రాష్ట్రాలకు, ఇతర దేశాలకు వలస వెళ్లాల్సిన అనివార్య పరిస్థితిని నేటి ప్రపంచీకరణ కల్పించింది. ఇప్పుడు వృద్ధాశ్రమాల్లో, ఇళ్లల్లో అనాథలుగా బతుకులీడ్చే తల్లిదండ్రులది ఒక్కొక్కరిదీ ఒక్కో విషాదగాథ. 'మనిషి విసిరేయబడుతున్నాడిప్పుడు/ ఊరికొక్కడు దేశానికొక్కడుగా/ వృద్ధులైన తల్లిదండ్రులు పల్లెటూళ్లలో/ కన్నబిడ్డలు చదువులకని హాస్టళ్లలో/ ఇక్కడ తల్లిదండ్రులు తీరికలేని బిజీలో/ అక్కడ తల్లిదండ్రులు ఆలన లేని వేదనలో/ మనిషి జీవితంలో ఇదో విషాదఘట్టం' అంటాడో కవి. ఈ సమాజంలో అమ్మానాన్న లేకుండా అనాథలుగా బతుకుతున్నవారు కొందరు. అమ్మానాన్నలను వదిలేసి అనాథలుగా బతుకుతున్నవారు ఇంకొందరు. 'నీటి బావుల్లాంటి అమ్మానాన్నలు దూరమయ్యాక/ ఎండమావుల్లాంటి జీవితం ఏహ్యామనిపించింది/ ఇక ఆనందం అనూహ్యామనిపించింది' అంటాడో కవి. ఈ చరిత్రలను ఏ సిరాతో రాసినా... సారాంశం ఒక్కటే. బతుకుదెరువు కోసం ఉన్న ఊరుని, కన్నవాళ్లని వదిలేసి పట్టణాలకు, విదేశాలకు వలసపోతున్న కన్నీటి కథలే. 'మనమే తల్లిదండ్రులమయ్యే వరకు తల్లిదండ్రుల ప్రేమ మనకు తెలియదు' అంటాడో రచయిత. ఎవరి జీవితం ఉన్నతస్థితికి చేరినా... వారి ఉన్నతి వెనుక తల్లిదండ్రుల నిరంతర శ్రమ వుంటుందనేది నగ్నసత్యం. అదే సమయంలో పిల్లలకు...వారి తల్లిదండ్రులే సర్వస్వం. పిల్లలను ప్రోత్సహించాలి...వారికి అండగా నిలబడాలి. లేదంటే పిల్లల మనస్సులో విచారం, కోపం తలెత్తే అవకాశం వుంటుంది. ఇటువంటి సంఘటనలు మనుషుల మధ్య దూరం పెరగడానికి కారణమౌతాయి.

అంతేకాదు, ఈ పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు పిల్లలతో, పిల్లలు తల్లిదండ్రులతో గడపగలిగే సమయాలు అరుదైపోయాయి. 'బూర్జువా వర్గం కుటుంబ వ్యవస్థ మీద వున్న మమకారపు మేలి ముసుగును లాగిపారేసి, కుటుంబ సంబంధాలను కేవలం ఆర్థిక సంబంధాలుగా దిగజార్చింది' అంటాడు కారల్ మార్క్స్ 'కమ్యూనిస్టు ప్రణాళిక'లో. తమ ఉనికికి రూపం ఇచ్చి, తమ ఉన్నతికి బాటలు వేసిన అమ్మానాన్నలకు ఓ చిరుకానుక ప్రతియేటా జులై నాలుగో ఆదివారం నిర్వహించే 'జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం'. 'తల్లిదండ్రుల శక్తి: సంతోషం, ఆరోగ్యం, ఆశాజనకంగా పిల్లలను పెంచడం' అనే థీమ్‌తో ఈ రోజును నిర్వహిస్తున్నారు. ఇదే ఆశావహ దృక్పథంతో తల్లిదండ్రులు పిల్లల ఒత్తిడిని అర్థం చేసుకోగలిగితే...పిల్లలు శ్రవణుడిలా తల్లిదండ్రులను ప్రేమించగలిగితే...వారి అనుబంధం మరింత బలపడుతుంది. నేటి పిల్లలు...రేపటి తల్లిదండ్రులేనన్న వాస్తవాన్ని గుర్తించిన రోజే నిజమైన తల్లిదండ్రుల దినోత్సవం.

మంచి మాట



ఈనాడు విజ్ఞానంగా భావిస్తున్నదంతా గతంలో కొంత మంది గొప్ప వ్యక్తుల శ్రమ ఫలమే.
- హెచ్.డబ్ల్యు.లాంగ్‌ఫెలో,
అమెరికన్ కవి, విద్యావేత్త.

కుటిల రాజకీయాలతోనే మణిపూర్ మంటలు

ప్రస్తుతం

తెలకపల్లి రవి

ఇటీవలి చరిత్రలో ఎన్నడూ లేనంతగా మణిపూర్ దురంతం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. కార్ వాషింగ్ వర్క్‌షాప్‌లో పని చేసుకుని బతికే ఇద్దరు ఆదివాసి యువతులను వివస్త్రలను చేసి వెంటాడి మానప్రాణాలు బలిగొంటున్న బీభత్స దృశ్యం జాతిని కలచివేసింది. ఘోరకలి జరిగాక రెండున్నర నెలలకు ఈ వీడియోలు బయటకు వచ్చినా ఇంత ఆగ్రహావేదనలు ప్రజ్వరిల్లాయంటే జరిగింది ఎంత దారుణమో, వాస్తవ పరిస్థితి మరెంత ఘాతుకంగా వుందోననే సందేహం ప్రతివారిలో కలిగింది. దానికదే విషయం బహిర్గతమయ్యే వరకూ తెలియనట్టే ప్రవర్తిస్తున్న డబుల్ డబ్బా పాలకులకు ఘోర పరాభవం ఎదురైంది. మొన్ననే ఎన్‌డిఎ విస్తృత సమావేశంలో గజమాల వేయించుకుని సూక్తులు వినిపించిన విశ్వగురు ప్రధాని మోడీ బోనులో నిలబడాల్సి వచ్చింది. అయితే అలాంటి పరాభవాలు పట్టించుకునే ఘటం కాదు గనక పార్లమెంటు సమావేశాల సందర్భంగా చేసిన అనివార్య వ్యాఖ్యలలో ఆయన ఈ తప్పుకు దేశంలోని వంద కోట్లమంది ప్రజలదీ బాధ్యత అన్నట్టు మాట్లాడేశారు. దేశం, సమాజం సిగ్గుపడాలన్నారు. విశ్వగురుగా గజమాల వేయించుకోవడానికి నమో నమో కీర్తనలతో ఊరేగడానికి తాను, అమానుషానికి మాత్రం అందరిదీ బాధ్యత! ఇంతకన్నా విడ్డూరమైన, విపరీతమైన విషయం మరోటి వుంటుందా? కాని బిజెపి మోడీ పాలనలో అదే భారతీయ వాస్తవం.

చర్చకే దిక్కు లేదు, చర్య ఎక్కడ?

మణిపూర్ లోనూ ఢిల్లీ లోనూ పాలించేది అక్షరాలా వారు చెప్పే డబుల్ ఇంజన్ సర్కార్. ఆపైన ఈశాన్య రాష్ట్రాలకు బిజెపి తరపున బాధ్యుడూ, మంత్రిగా ఈ శాఖకు బాధ్యుడు కూడా తన కుడి భుజమైన హోంమంత్రి అమిత్‌షా నే. మణిపూర్ పాలకుడైన బీరేన్ సింగ్ సరేసరి. అయినాసరే దేశ ప్రజలు వంద కోట్ల మంది సిగ్గు పడాలిగాని ఈ ఇద్దరు ముగ్గురు మనుషులు ఈషణ్మాత్రం సిగ్గుపడినట్టు కనిపించరు. తమకు నచ్చని రాష్ట్రాలలో చీమ చిటుక్కుమంటే ట్వీట్లు పెట్టి ఫీట్లు చేసే సంఘ పరివార్ పెద్దలెవరూ స్పందించరు. నూతన పార్లమెంటు భవనం ముందు ఈ ఘోర వార్తపై స్పందిస్తూ మణిపూర్ పుత్రికలకు జరిగిన ఘోరం పట్ల ప్రతివారూ విచారిస్తున్నారని, కారకులెవరైనా వదలిపెట్టే ప్రసక్తి లేదని గంభీర ప్రకటన చేసిన ప్రధాని ఆ సభలోనే ఈ సమస్యపై చర్చకు హాజరు కారు. సమగ్ర చర్చ కాకుండా స్వల్ప వ్యవధితో సరిపెడతామంటారు. బాధ్యులెవరైనా కఠిన చర్యలు తీసుకుంటామని గర్జించినవారు తమ అనుంగు ముఖ్యమంత్రిని మాత్రం ముట్టుకోరు, రాజీనామాకు ఆదేశించరు. మే 4న జరిగిన ఈ దారుణంపై మే 14న ఎఫ్‌ఐఆర్ నమోదైతే ఇంతకాలం ఏ గుడ్డి గుర్రానికి పళ్లు తోముతున్నారని నిలదీయరు. ఇవన్నీ చేయకపోవడం ఒకటి, ఈ వీడియో ఇంతకాలం తర్వాత ఇప్పుడే రావడంలో కుట్ర వుందని ఆరోపిస్తారు. గతంలో జరిగిన మరికొన్ని అఘాయిత్యాలతో పోటీ పెట్టి మాట్లాడతారు. చర్చలు జరిపిస్తారు, వ్యాసాలు రాయిస్తారు. జరిగిందాన్ని కప్పిపుచ్చడానికి, తీవ్రత తగ్గించడానికి సకల శక్తియుక్తులూ వెచ్చిస్తారు. అందుకే ఇది డబుల్ హిపోక్రసీ. రెట్టింపు వంచన. టెలిగ్రాఫ్ పత్రిక 79 మొసళ్ల కార్టూన్ వేసి ఆ పైన మోడీ విచారాన్ని పెట్టింది. ఎందుకంటే నవ వర్ష నమో పాలన తర్వాత వీటికి తెల్గిగ్గా లోబడిపోయే స్థితిలో దేశ ప్రజలు లేరు.

కాషాయ వ్యూహాల కరాళ ఫలితమే

ఈశాన్య రాష్ట్రాలు కూడా తమ ప్రాబల్యంలోకి రావడం మోడీ మహత్తులలో ఒకటని చెప్పుకునే బిజెపి అందుకు అనుసరించిన ఎత్తులు, జిత్తుల పర్యవసానమే ఈశాన్య జ్వాలలు. గుర్తు చేసుకుంటే కొంతకాలం కిందట అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌ల మధ్య సరిహద్దు వివాదం ప్రజ్వరిల్లడం ఎవరూ మర్చిపోలేదు. నిరంతరం తన మాటలతో వివాదాలు సృష్టించే అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ విశ్వ శర్మ పరిష్కారానికి ఏమీ చేసింది లేదు ఎగదోయడం తప్ప. తర్వాత మేఘాలయ తోనూ ఇదే తరహా ఘర్షణ చెలరేగి ఆరుగురు చనిపోయారు. ఇవి అస్సాం నుంచి విడదీయబడిన రాష్ట్రాలు కావడం గుర్తుంచుకోదగింది. ఎందుకంటే 1950లో రాజ్యాంగం అమలులోకి వచ్చినపుడు ఈశాన్యాన మణిపూర్, త్రిపుర మాత్రమే కేంద్రపాలిత ప్రాంతాలుగా వుండేవి. 1954లో అరుణాచల్ ప్రదేశ్, 1963లో నాగాలాండ్, 1969లో మేఘాలయ, 1972లో మిజోరాం అస్సాం నుంచి విడదీసి ఏర్పాటు చేసినవే. మొదటి నుంచి వున్న మణిపూర్, త్రిపుర 1972లో పూర్తి రాష్ట్రాలయ్యాయి. ఈశాన్య ప్రాంతం నేరుగా బ్రిటిష్ వారి పాలనలో ఎన్నడూ లేదు. వారు కావాలనే చైనాకూ తమకూ మధ్య ఒక విడుపు లాగా దాన్ని అట్టిపెట్టారు. అక్కడ అనేక జాతులు, ఉపజాతుల గిరిజనులు ఆదివాసులు జీవించేవారు. నాగా, కుకీ, మిసో తదితర తెగలు ఉపజాతులు అలాంటివే. గిరిజనులలో క్రైస్తవ మిషనరీల ప్రభావం కూడా ఎక్కువే. మణిపూర్ మైదాన ప్రాంతాలలో మైతేయిలు వుంటారు. కుకీలు మూలవాసులైనప్పటికీ రాజకీయ వ్యవస్థలో మైతేయిల ప్రాబల్యమే ఎక్కువ. ఈ చిన్న రాష్ట్రంలో మొత్తం 36 తెగలు, ఉపజాతుల వారు వుంటారంటే సమస్య అర్థమవుతుంది. మైతేయిలు ఇంఫాల్ లోయలో వుంటూ హిందూ మతాన్ని సనామహి అనే స్థానిక విశ్వాసాలను ఆచరిస్తారు. కుకీలు, నాగాలు అత్యధికంగా క్రైస్తవ మతానుయాయులు. ఈ తెగలు, ఉపజాతుల మధ్య స్వార్థ రాజకీయ శక్తులు పట్టించుకోని కేంద్రం కారణంగా నిరంతర ఘర్షణలు, తిరుగుబాట్లు జరుగుతూ వచ్చాయి. అందులో నాగా, కుకీల తగాదాలు ప్రధానమైనవి. 2017లో బిజెపి అధికారంలోకి రావడంతో ఆరెస్సెస్ రంగంలోకి దిగి హిందూ విశ్వాసాలు గల మైతేయిలను క్రైస్తవాన్ని అనుసరించే కుకీలకు వ్యతిరేకంగా కూడగట్టింది. దాంతో ఇది మత వివాదంలా కూడా మారిపోయింది.

ఎఫ్‌ఐఆర్ తెలియదా?

బాధ్యులెవరైనా కఠిన చర్యలు తీసుకుంటామని గర్జించినవారు తమ అనుంగు ముఖ్యమంత్రిని మాత్రం ముట్టుకోరు, రాజీనామాకు ఆదేశించరు. మే 4న జరిగిన ఈ దారుణంపై మే 14న ఎఫ్‌ఐఆర్ నమోదైతే ఇంతకాలం ఏ గుడ్డి గుర్రానికి పళ్లు తోముతున్నారని నిలదీయరు. ఇవన్నీ చేయకపోవడం ఒకటి, ఈ వీడియో ఇంతకాలం తర్వాత ఇప్పుడే రావడంలో కుట్ర వుందని ఆరోపిస్తారు. గతంలో జరిగిన మరికొన్ని అఘాయిత్యాలతో పోటీ పెట్టి మాట్లాడతారు. చర్చలు జరిపిస్తారు, వ్యాసాలు రాయిస్తారు. జరిగిందాన్ని కప్పిపుచ్చడానికి, తీవ్రత తగ్గించడానికి సకల శక్తియుక్తులూ వెచ్చిస్తారు. అందుకే ఇది డబుల్ హిపోక్రసీ. రెట్టింపు వంచన.

పొరుగునే వున్న మయన్మార్‌లో 2021లో సైనిక నియంతృత్వం అధికారం కైవశం చేసుకున్నాక దాడి తట్టుకోలేక వేలాది మంది చిన్ శరణార్థులు వచ్చిపడటంతో పరిస్థితి మరింత దిగజారింది. వీరు కూడా కుకీ లే. మిజోరాం, మణిపూర్‌ల లోని కుకీలు వారిని ఆహ్వానించి ఆశ్రయమిచ్చారు. కాని మోడీ ప్రభుత్వం వారికి ఆశ్రయం నిరాకరించి అక్రమ చొరబాటుదారులుగా ప్రకటించింది. ఇదే సమయంలో బీరేన్ సింగ్ ప్రభుత్వం రిజర్వు అడవుల నుంచి కుకీలను భారీ ఎత్తున తొలగించడం మొదలెట్టింది. అడవులలో మాదక ద్రవ్యాల పంటలను నాశనం చేసేందుకు దాడి కూడా గిరిజనులను దూరం చేసింది. కుకీలు అక్రమ చొరబాటుదారులని ప్రచారం చేసే తీవ్రవాద మైతేయి వర్గాలకు ఆరెస్సెస్ వత్తాసునిచ్చింది. అస్సాం ముఖ్యమంత్రి శర్మ, బిజెపి ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ ఆ ప్రాంతంలో పని చేస్తున్న కాలంలోనే కుకీ తీవ్రవాద సంస్థ యుకెఎల్‌ఎఫ్ (యునైటెడ్ కుకీ లిబరేషన్ ఫ్రంట్)తో సంబంధం పెట్టుకుని నిధులు సమకూర్చినట్టు తర్వాత వెల్లడైంది. ఇందుకు ప్రతిగా వారు 2017 లోనూ 2019 లోనూ బిజెపి కి ఎన్నికల్లో మద్దతునిచ్చారు. ఈ విషయం బయటకు వచ్చాక ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్‌కు మైతేయిలలో కూడా మద్దతు లేకుండా పోయింది. తమ సమస్యలకు మూలకారణంగా భావించిన ఆయనను కుకీలు ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే వున్నారు. బిజెపి లోనే వున్న పదిమంది కుకీ ఎంఎల్‌ఎలు ప్రత్యేక పాలనా విభాగం కావాలని ఆందోళన మొదలెట్టారు. ఇప్పుడు మనం చూస్తున్న కల్లోలం వెనక ఇంత లోతైన నేపథ్యముందని గుర్తుంచుకోవాలి. పులి మీద పుట్రలా ఈ పరిస్థితులలో మైతేయిలను కూడా గిరిజనులుగా పరిగణించాలని మార్చి 27న మణిపూర్ హైకోర్టు తీర్పు చెప్పడం, దానికి అభ్యంతరం లేదని బీరేన్ సింగ్ హడావుడిగా ప్రకటించడంతో ఈ ఘర్షణలు పరాకాష్టకు చేరాయి. ఈ క్రమంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోకపోగా కుటిల వ్యూహంతో మరింత రగలడానికి కారణమైనాయి. మే 4వ తేదీ మహిళలపై ఘోర కలి వీడియో జులై 20న బయటకు వచ్చినప్పటికీ నిజానికి రాష్ట్ర ప్రభుత్వానికి పోలీసులకు ఈ విషయాలు తెలియవని కాదు. మే రెండవ వారంలోనే వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం ఎఫ్‌ఐఆర్ నమోదు జరిగాయి. మే 29న అమిత్‌షా అక్కడ పర్యటించి వచ్చారు. ఇక ఘనమైన మోడీ గారికి ఈ సమస్య పట్టించుకోవాలనే ఆలోచనే లేకుండా పోయింది. ప్రతిపక్షాలు ఆందోళన, ఆగ్రహం వెలిబుచ్చుతున్నా చీమ కుట్టినట్టు లేకపోయింది. మణిపూర్ నుంచి బిజెపి తరపున రెండు ప్రతినిధి బృందాలు, ప్రతిపక్షాల తరపున ఒక బృందం ఆయనను కలుసుకోవడానికి ఢిల్లీలో నిరీక్షిస్తుంటే ఆయన మాత్రం అమెరికాలో భుజకీర్తులందుకుంటున్నారు. అమెరికా, ఫ్రాన్స్ వంటి దేశాలలోనూ యూరోపియన్ పార్లమెంటులోనూ మణిపూర్ పరిస్థితిపై తీర్మానాలు చేస్తుంటే పట్టించుకోలేదు సరికదా చర్చ కూడా చేయకుండా మన పార్లమెంటును వాయిదా వేయించారు! కనుక మణిపూర్ పుత్రికలంటూ ఆయన మాట్లాడటాన్ని మొసలి కన్నీరు కన్నా మోడీ కన్నీరు అంటే చాలదా?

ఘనమైన మోడీ గారికి ఈ సమస్య పట్టించుకోవాలనే ఆలోచనే లేకుండా పోయింది. ప్రతిపక్షాలు ఆందోళన, ఆగ్రహం వెలిబుచ్చుతున్నా చీమ కుట్టినట్టు లేకపోయింది. మణిపూర్ నుంచి బిజెపి తరపున రెండు ప్రతినిధి బృందాలు, ప్రతిపక్షాల తరపున ఒక బృందం ఆయనను కలుసుకోవడానికి ఢిల్లీలో నిరీక్షిస్తుంటే ఆయన మాత్రం అమెరికాలో భుజకీర్తులందుకుంటున్నారు. అమెరికా, ఫ్రాన్స్ వంటి దేశాలలోనూ యూరోపియన్ పార్లమెంటులోనూ మణిపూర్ పరిస్థితిపై తీర్మానాలు చేస్తుంటే పట్టించుకోలేదు సరికదా చర్చ కూడా చేయకుండా మన పార్లమెంటును వాయిదా వేయించారు! కనుక మణిపూర్ పుత్రికలంటూ ఆయన మాట్లాడటాన్ని మొసలి కన్నీరు కన్నా మోడీ కన్నీరు అంటే చాలదా?

జరగాల్సిందేమిటి?

మాట్లాడితే వీర జవాన్లు, దేశభక్తి అంటూ ఊదరగొట్టే కేంద్ర పాలకులు కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికుని భార్యకు ఈ దుర్గతి పడితే స్పందించకపోవడాన్ని ఏమంటాం? మే 4 రాత్రి దుష్ట మూకలు వేల సంఖ్యలో ఆ గ్రామాన్ని చుట్టుముట్టి కుకీ కుటుంబాలను తరిమేయడమే గాక ఇద్దరు యువతుల బట్టలూడదీయించి మృగాల్లా హింసిస్తూ ఈడ్చుకు పోయారు. ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. వాళ్లను కాపాడేందుకు వెళ్లిన వారిని చంపేశారు. రక్తసిక్తమైన శరీరంతో ఆ అభాగ్యురాళ్లు ఇద్దరినీ తీసుకుని వారు ఫిర్యాదు చేయడానికి పోలీసు స్టేషన్‌కు చేరుకుంటే పరిధి సమస్య వచ్చింది. దాన్ని మరో స్టేషన్‌కు బదలాయించారు. ఇంత జరిగినా ఏ చర్య తీసుకున్నది లేదు, ఇంటర్‌నెట్ సెన్సార్ వుంది గనక బయటకు రాలేదు. ఈ లోగా మహిళా కమిషన్‌కు, ముఖ్యమంత్రికి ఫిర్యాదు వెళ్లినా స్పందన లేదు. వందల సంఖ్యలో ఇలాంటివి వస్తుంటే ఏదని చూస్తామన్నది వారి అహంకారపూరితమైన జవాబు. ఇంకా ఆ ముఖ్యమంత్రిని ముట్టుకోని కేంద్రాన్ని ఏమనాలి? ఈ విషయంలో ముందే జోక్యం చేసుకుని తీవ్రంగా ఖండించిన సిజెఐ డి.వై.చంద్రచూడ్ ప్రభుత్వం చర్య తీసుకోకుంటే తాము రంగంలోకి దిగాల్సి వస్తుందన్నారు. అత్యున్నత న్యాయమూర్తి స్పందనకూ ప్రభుత్వాధినేత స్పందనకూ తేడా కనిపిస్తూనే వుంది. వాస్తవానికి రాని స్పందనకోసం వ్యవధి ఇవ్వడం కంటే సుప్రీంకోర్టు వెంటనే రంగంలోకి దిగి చర్య తీసుకోవడం చాలా మంచిది. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ తక్షణం గద్దె దిగాలి. ఇప్పటికీ బయటకు రాని ఘోరాలు మరెన్ని వున్నాయో ప్రత్యేకంగా దర్యాప్తు చేసేందుకు ఒక కమిటీని నియమించాలి. బాధితుల రక్షణ కోసం తక్షణం కేంద్రం రంగంలోకి దిగాలి.

★

నాటో సదస్సు : ప్రపంచంపై ఆధిపత్యానికి కుతంత్రాలు !

వ్యాఖ్య



లిథుయేనియా రాజధాని విల్నియస్‌లో ఇటీవల జరిగిన నాటో సదస్సు, అమెరికా నేతృత్వంలో పశ్చిమ దేశాల సైనిక కూటమి సరి కొత్త దాడి ప్రారంభించింది. ఉక్రెయిన్ యుద్ధం ఈ సదస్సులో కీలకాంశం అయినప్పటికీ, చివరగా జారీ చేసిన డిక్లరేషన్ మాత్రం ఆ అంశాన్ని మించి, యూరప్‌కు వెలుపల ఇతర ప్రాంతాల్లో తన ప్రయోజనాల గురించి పేర్కొంది. తద్వారా ప్రపంచ ఆధిపత్యాన్ని ఎలాగైనా కొనసాగించాలనే తన ఉద్దేశ్యాన్ని అది స్పష్టం చేసింది.

గతేడాది మాడ్రిడ్‌లో జరిగిన సదస్సు డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లుగా, భూ, వాయు, సముద్ర జలాల, సైబర్ స్పేస్ రంగాల్లో ఎదురయ్యే భద్రతాపరమైన ముప్పులకు సంబంధించి '360 డిగ్రీల వైఖరి' గురించి డాక్యుమెంట్ పేర్కొంటోంది.

ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించినంత వరకు నాటో వినిపించిన గళం, దూకుడును పెంచేలా, పోరాటానికి సుముఖంగా వున్నామనేలా వుంది. అంతేకానీ శాంతి చర్చలకు గల అవకాశాల గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. ఉక్రెయిన్ భూభాగాల నుండి రష్యా పూర్తిగా, బేషరతుగా వైదొలగాలన్నది శాంతికి ముందస్తు షరతుగా పేర్కొంది. ఉక్రెయిన్‌కు ఆయుధాలు, యుద్ధ పరికరాల సరఫరాలను పెద్ద ఎత్తున పెంచేందుకు నాటో సదస్సు విడిగా ఒక ఒప్పందంలో అంగీకరించింది.

తక్షణమే నాటో సభ్యత్వం కావాలంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చేస్తున్న డిమాండ్‌ను నాటో నేతలు అంగీకరించలేదు. దీనికి కూడా వ్యూహాత్మక ఎత్తుగడలు వున్నాయి. ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం ఇచ్చినట్లైతే నాటో ఒప్పందంలోని ఆర్టికల్ 5 అమల్లోకి వస్తుంది. అంటే అమెరికా, ఇతర నాటో సభ్య దేశాలు ప్రత్యక్షంగా రష్యాతో యుద్ధానికి దిగినట్లే అవుతుంది. ప్రస్తుతం నాటో కూటమిలోకి పరోక్షంగా వచ్చినట్లేనంటూ డిక్లరేషన్ ఉక్రెయిన్‌కు హామీ ఇచ్చింది. "నాటో కూటమితో రాజకీయంగా విలీనమైనట్లేనని, పరస్పరం సహకరించుకోవడం మరింత పెరుగుతోందని" డిక్లరేషన్ పేర్కొంది. ఒకపక్క నాటో దేశాలు అందించే అత్యంత అధునాతనమైన ఆయుధాల సాయంతో నిలకడగా అలా పోరు సల్పుతూనే, మరోపక్క యుద్ధం కారణంగా జరిగే విధ్వంసం, వినాశనం భారాన్ని మాత్రం ఉక్రెయిన్ భరించే పరిస్థితి నెలకొనాలని అమెరికా కోరుకుంటోంది.

ఫిన్లాండ్‌ను కొత్త సభ్యురాలిగా తీసుకున్నారు. టర్కీ తన అభ్యంతరాన్ని ఉపసంహరించుకోవడంతో స్వీడన్ చేరికకు మార్గం సుగమమైంది. ఈ రెండు దేశాల చేరికతో, రష్యాతో భూ సరిహద్దులు రెట్టింపు కన్నా పెరిగాయి. తూర్పు యూరప్ అంతటా మోహరించిన బలగాలు, ఆయుధాల వివరాలను పేర్కొంటూ ఒక డాక్యుమెంట్‌ను నాటో సదస్సు ఆమోదించింది. అలాగే నాటో సత్వర ప్రతిస్పందనా బలగాల సంఖ్యను 40 వేల నుండి మూడు లక్షల మంది సైనికులకు పెంచాలన్న ప్రణాళికకు కూడా ఆమోదముద్ర వేసింది. ఆ రకంగా, రష్యా చుట్టుపక్కల సరిహద్దులను నాటో బలగాలతో చుట్టుముట్టడం చాలా వేగంగా పెరిగింది.

ఇలా నాటో తూర్పు దిశగా విస్తరించడమే ఉక్రెయిన్‌లో యుద్ధానికి మొదటి కారణంగా వుంది. జర్మనీ ఏకీకరణ తర్వాత నాటోను తూర్పు దిశగా విస్తరించబోమని ఇచ్చిన హామీ నుండి అమెరికా, పశ్చిమ దేశాలు వెనక్కి మళ్ళాయి. మధ్య ప్రాచ్యం, ఆఫ్రికా, ఇండో-పసిఫిక్ ప్రాంతంతో సహా ప్రపంచంలో ప్రతి భాగంలోనూ తమ వ్యూహాత్మక ప్రయోజనాల గురించి విల్నియస్ డిక్లరేషన్ మాట్లాడింది. ఆ రకంగా, గుత్తాధిపత్యం కోసం...తన ప్రపంచ ప్రణాళికకు ద్రోహం చేసింది.

నాటో తూర్పు దిశగా విస్తరించడమే ఉక్రెయిన్‌లో యుద్ధానికి మొదటి కారణంగా వుంది. జర్మనీ ఏకీకరణ తర్వాత నాటోను తూర్పు దిశగా విస్తరించబోమని ఇచ్చిన హామీ నుండి అమెరికా, పశ్చిమ దేశాలు వెనక్కి మళ్ళాయి. మధ్య ప్రాచ్యం, ఆఫ్రికా, ఇండో-పసిఫిక్ ప్రాంతంతో సహా ప్రపంచంలో ప్రతి భాగంలోనూ తమ వ్యూహాత్మక ప్రయోజనాల గురించి విల్నియస్ డిక్లరేషన్ మాట్లాడింది.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

డిక్లరేషన్‌లో కీలకంగా దృష్టి పెట్టిన మరో అంశం చైనా. "అంతర్జాతీయంగా తన ప్రభావాన్ని, అధికారాన్ని పెంచుకునేందుకు, విస్తృత స్థాయిలో రాజకీయ, ఆర్థిక, సైనిక సాధనాలు ఉపయోగిస్తోందంటూ" చైనాపై ఆరోపణలు చేసింది. "హానికరమైన హైబ్రిడ్, సైబర్ కార్యకలాపాలతో నాటో భద్రతను దెబ్బతీస్తోందని, కీలకమైన సాంకేతిక రంగాలను, ముఖ్యమైన మౌలిక సదుపాయాలను, వ్యూహాత్మక పరికరాలను, సరఫరా మార్పులను నియంత్రించడానికి ప్రయత్నిస్తోందంటూ ఆరోపణలు చేసింది. ప్రపంచ దేశాలపై అమెరికా గుత్తాధిపత్యాన్ని కొనసాగించేందుకు రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పాటు చేసుకున్న యంత్రాంగాలు-నిబంధనల ఆధారిత అంతర్జాతీయ వ్యవస్థ-ను ఉల్లంఘిస్తోందంటూ చైనాపై ఆరోపణలు చేసింది.

విల్నియస్ సదస్సులో క్వాడ్, అకస్ దేశాల రాజకీయ నేతల భాగస్వామ్యాన్ని చూసిన చైనాను ఈ రకంగా లక్ష్యంగా చేసుకుంది. ఈ సదస్సుకు జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ప్రధానులు, దక్షిణ కొరియా అధ్యక్షుడు హాజరయ్యారు. చైనాను ఎదుర్కొనడానికి, ఏకాకిని చేయడానికి తూర్పు ప్రాంతంలో నాటోను సృష్టించాలని అమెరికా ఆశిస్తోంది. క్వాడ్ సభ్యురాలైనప్పటికీ భారత్ ఈ సదస్సులో పాల్గొనలేదు. ప్రాథమికంగా ఉక్రెయిన్ యుద్ధాన్ని, రష్యాను విల్నియస్ సదస్సు ఎదుర్కొనాల్సి వున్నందున, తన తటస్థ వైఖరిని దృష్టిలో వుంచుకుని భారత్ ఈ సదస్సుకు హాజరు కాలేకపోయింది. అయితే, పశ్చిమ దేశాల కూటమి అనుసరిస్తున్న ఇండో-పసిఫిక్ వ్యూహాన్ని నాటో సదస్సు అంచనా వేస్తోంది. ఈ ఇండో పసిఫిక్ వ్యూహంలో ఇప్పటికే భారత్ పూర్తిగా రంగంలోకి దిగింది.

పెరుగుతున్న సైనికీకరణను, అమెరికా, దాని మిత్రపక్షాల దూకుడును నాటో సదస్సు స్పష్టంగా తెలిపింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సైన్యం ఉపసంహరణకు దిగిన జర్మనీ, జపాన్‌లు రెండూ తిరిగి ఆయుధాలను సమకూర్చుకునే పంథాను ఇప్పుడు అనుసరిస్తున్నాయి. సైనిక పాటవాన్ని సమకూర్చు కుంటున్నాయి. ఉక్రెయిన్ సాయుధ బలగాల ప్రతి దాడిలో పెద్దగా పురోగతి లేకపోయినప్పటికీ ఉక్రెయిన్‌లో యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆశిస్తున్నారు. యూరప్‌పై తన గుత్తాధిపత్యాన్ని మరింత సంఘటితం చేసుకోవాలన్న అమెరికా ఆకాంక్షకు, చైనాతో జరగబోయే పోరాటంలో వారందరినీ కూడగట్టేందుకు ఈ సుదీర్ఘ యుద్ధం, అనుగుణంగా వుంటుంది. ఈ నేపథ్యంలోనే, అమెరికా దుందుడుకు ప్రణాళికలను మోడీ ప్రభుత్వం మరింతగా అంగీకరించడాన్ని చూడాల్సి వుంటుంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం) ★

జనవాక్యం

'మత్తు'పై ఉక్కుపాదం

దేశాన్ని అత్యంత ప్రమాదకరమైన మాదకద్రవ్యాల సమస్య పట్టి పీడిస్తోంది. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు బానిసలు కావడం కలవరం కలిగిస్తోంది. వీరిలో కొందరు ఎంత హీన స్థాయికి దిగజారిపోతున్నారో వారికే తెలియని పరిస్థితి. దీనిని అదునుగా చేసుకుని దేశంలో గంజాయి వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోంది. పొరుగున ఉన్న పాకిస్తాన్ నుంచి, ఆఫ్రికా దేశాల నుంచి వివిధ రకాల మాదక ద్రవ్యాలు మన దేశంలోకి వాయు, జల మార్గాల ద్వారా ప్రవేశిస్తున్నాయి. తరచూ అనేక అంతర్జాతీయ విమానాశ్రయాలలో జరిగే తనిఖీల్లో కొన్ని కోట్ల రూపాయల విలువ చేసే మాదక ద్రవ్యాలు పట్టుబడుతున్నాయి. మన దేశంలో కూడా కొండ ప్రాంత రాష్ట్రాల్లో గంజాయి సాగు అధికంగా సాగుతోందని నివేదికలు చెబుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ శాఖల తనిఖీ అధికారులు ఈ మత్తు మందులు, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలి. దేశ ప్రజలను, ముఖ్యంగా మత్తు బానిసలను వాటి నుంచి రక్షించాలి. అదే సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లల ఆహారపు అలవాట్లు, ప్రవర్తన, స్నేహాలపై దృష్టి సారించాలి.

– రావుశ్రీ

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com



నేరస్తులను తక్షణమే అరెస్టు చేయాలి

- ఇంఫాల్‌లో వేలాదిమందితో ఆదివాసీ గిరిజన మహిళల నిరసన ప్రదర్శన
- ఐదవ నిందితుడి అరెస్టు
- ఘటనను ఖండించిన 10మంది నాగా ఎమ్మెల్యేలు, వివిధ రంగాల ప్రముఖులు

ఇంఫాల్, న్యూఢిల్లీ బ్యూరో : మణిపూర్‌లో మహిళలపై జరిగిన ఆటవిక దాడిని నిరసిస్తూ ఆందోళనలు, నిరసనలు ఉధృతంగా కొనసాగుతున్నాయి. నేరస్తులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మణిపూర్‌లో ఆదివాసీ గిరిజన నాయకుల వేదిక (ఐటిఎల్‌ఎఫ్) మహిళా విభాగం ఆధ్వర్యాన వేలాదిమందితో పెద్ద ఎత్తున ప్రదర్శన జరిగింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దాదాపు 15వేల మంది ఆందోళనకారులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రదర్శకులనుద్దేశించి మహిళా సంఘాల నేతలు ప్రసంగించారు. ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇంఫాల్ సౌత్‌కి 65కిలోమీటర్ల దూరంలో కుకీలకు పట్టు గల చురచందాపూర్‌లోని 'వాల్ ఆఫ్ రిమెంబరెన్స్' వద్ద ఈ ప్రదర్శన జరిగింది. మణిపూర్ హింసలో మరణించిన తమ మైనారిటీ కమ్యూనిటీకి చెందిన వారి డమ్మీ శవపేటికలను అక్కడ వుంచారు. కుకీ మహిళల మానవ హక్కుల సంఘం ఛైర్‌పర్సన్ ఎంగ్‌యిన్‌నికిమ్ మాట్లాడుతూ, ఈ దారుణాల వెనక గల వ్యక్తి మెజారిటీ మెయితి కమ్యూనిటీకి చెందిన సింగ్ అని విమర్శించారు.

సోమవారం ప్రతిపక్షాల నిరసన

మణిపూర్‌పై ప్రధాని ప్రకటనకై పట్టుబడుతూ ప్రతిపక్ష ఎంపీలు సోమవారం పార్లమెంట్ ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన నిర్వహించనున్నారు. సోమవారం పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే నివాసంలో చర్చించిన అనంతరం వారు సభకు హాజరవడానికి ముందుగా గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపడతారు. ప్రతిపక్షాలు ఎటువంటి సమయ పరిమితులు లేకుండా అన్ని పార్టీలు మాట్లాడటానికి అనుమతించేలా చర్చను కోరుతున్నాయి.

చర్యలు తీసుకోవాలి : రాష్ట్రాల మహిళా కమిషన్లు

మణిపూర్ వీడియో ఘటనపై చర్యలు తీసుకోవాలని వివిధ రాష్ట్రాల మహిళా కమిషన్లు డిమాండ్ చేశాయి. కాగా, తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మేఘాలయ మహిళా కమిషన్ డిమాండ్ చేసింది. మిజోరాం స్టేట్ కమీషన్ ఫర్ ఉమెన్, అరుణాచల్ ప్రదేశ్ ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ, నాగ మదర్స్ అసోసియేషన్ కూడా బాధితులకు న్యాయం చేయాలని, అందరు మహిళలు, బలహీన వర్గాలకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని డిమాండ్ చేస్తూ జాతీయ మహిళా కమిషన్, మణిపూర్ ప్రభుత్వానికి లేఖలు రాశాయి. తమిళనాడు వ్యాప్తంగా పలు జిల్లాల్లో మహిళా సంఘాలు నిరసనలు నిర్వహించాయి. ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్ స్వాతి మలాల్ ఆదివారం మణిపూర్‌లో పర్యటించి, పరిస్థితులను సమీక్షించి, నిజ నిర్ధారణ నివేదికను అందచేస్తారు.

ఆటవికం, సిగ్గుచేటు : ప్రముఖుల ఆందోళన

మణిపూర్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. నిర్మాతలు, సంగీత కళాకారులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలతో సహా పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ ఘటనను ఆటవిక చర్యగా అభివర్ణించారు. నేరస్తులకు కఠిన శిక్ష విధించాలని కోరారు. ఒడిషాలో నిర్మాతలు, రచయితలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ నేతలు ఈ ఘటనను తీవ్రం గా ఖండించారు. భువనేశ్వర్‌లోని మాస్టర్ కేంటీన్ స్క్వేర్ వద్ద ధర్నా నిర్వహించారు.

ఐదవ నిందితుడి అరెస్టు

మణిపూర్ ఘటనకి సంబంధించి పోలీసులు ఐదవ నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడిని 19ఏళ్ళ వ్యక్తిగా గుర్తించారు. దీంతో ఈ ఘటనలో ఇప్పటివరకు అరెస్టు చేసిన వారి సంఖ్య ఐదుకు చేరింది. నలుగురు నిందితులను 11 రోజుల పోలీసు కస్టడీకి శుక్రవారం పంపారు.

తక్షణమే న్యాయం : నాగా గ్రూపుల డిమాండ్

అమానుషమైన ఈ ఘటనను ఖండిస్తూ తక్షణమే బాధిత మహిళలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మణిపూర్ నాగా గ్రూపులు డిమాండ్ చేశాయి. యునైటెడ్ నాగా కౌన్సిల్, ఆల్ నాగా స్టూడెంట్స్ అసోసియేషన్ మణిపూర్ సహా పలు నాగా గ్రూపులు ఈ ఘటనను తీవ్రంగా ఖండించాయి.

10మంది నాగా ఎమ్మెల్యేల ఖండన

మణిపూర్‌లో 10మంది నాగా ఎమ్మెల్యేలు ఈ దారుణాన్ని ఖండించారు. వీరిలో తొమ్మిది మంది బిజెపి దాని మిత్రపక్షాలకు చెందినవారు. ఈ నెల 20నే వీరు లాంగోల్‌లో పత్రికా సమావేశం పెట్టి ఖండించారు. బాధిత కుటుంబాలకు నాగా ఎంఎల్‌ఎల ఫోరం తన పూర్తి సంఘీభావాన్ని తెలియచేస్తోందన్నారు.

ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న వేలాది మంది కుకీలు

మతతత్వ శక్తుల దుష్ట ఎజెండా వల్లే హింస : కేరళ సిఎం విజయన్

మణిపూర్‌లో మతతత్వ శక్తుల 'దుష్ట ఎజెండా' వల్లే హింస జరుగుతోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. మణిపూర్ నుంచి వెలువడుతున్న హింసాత్మక ఘటనలు "భయంకరమైనవి"గా ఉన్నాయని పేర్కొన్నారు. "మణిపూర్ హింసాత్మక ఘటనలు ప్రతి భారతీయుడి మనస్సాక్షిని ఛిద్రం చేశాయి. రాష్ట్రంలో కొనసాగుతున్న కలహాలు మత ఉద్రిక్తతలకు ఆజ్యం పోసే దుర్మార్గపు ఎజెండా కారణంగానే జరుగుతున్నాయి. అన్ని లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు మణిపూర్‌లో శాంతి, సాధారణ స్థితిని పునరుద్ధరించాలని డిమాండ్ చేయాలి" అని పేర్కొన్నారు. మణిపూర్‌లో రెండు నెలలకు పైగా కొనసాగుతున్న జాతి హింసను భయాందోళనలతో మాత్రమే చూడగలమని ఆయన అన్నారు. మానవ స్పృహను వేధించే భయంకరమైన దృశ్యాలు ఆ రాష్ట్రం నుండి వస్తూనే ఉన్నాయని, కుకీ కమ్యూనిటీకి చెందిన మహిళలను అల్లరి మూకలు అత్యంత నీచంగా, క్రూరమైన రీతిలో వేటాడాయని విమర్శించారు. మణిపూర్‌లో క్రైస్తవ సమాజాన్ని లక్ష్యంగా చేసుకునే ప్రయత్నం జరుగుతోందని, గిరిజన సంఘాల చర్చిలపై విస్తృతంగా దాడులు చేసి ధ్వంసం చేస్తున్నారని దుయ్యబట్టారు. అధికార రాజకీయాల కోసం రాష్ట్రాన్ని అల్లకల్లోలంగా మార్చే ఎజెండాను సంఘ్ పరివార్ కలిగి ఉందని, ఈ విషయాన్ని దేశంలోని లౌకిక సమాజం గుర్తించాలని కోరారు. ఈ అంశంపై బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మౌనం వహించడం, హింస వెనుక ఉన్న సంఘ్ పరివార్ ఎజెండా స్పష్టం అవుతోందని విమర్శించారు. మత ధ్రువీకరణను బలోపేతం చేయడానికి ఉద్దేశపూర్వకంగా చేసే ప్రయత్నాలను ప్రతిఘటించడం, ఓడించడం ప్రజాస్వామ్య సూత్రాలపై నమ్మకం ఉన్న ప్రజల కర్తవ్యమని పిలుపునిచ్చారు.

రాష్ట్రపతికి జార్ఖండ్ సిఎం లేఖ

మణిపూర్‌లో గిరిజనుల పట్ల ఇలా ఆటవికంగా వ్యవహరించడాన్ని ఎంత మాత్రమూ అనుమతించరాదని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కోరారు. ఈ మేరకు ఆయన ఒక లేఖ రాశారు. మాట్లాడేందుకు వీల్లేని రీతిలో మహిళలు అనుభవించిన వేధింపులపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లోనే మోడీ పర్యటనలు : అశోక్ గెహ్లాట్

ప్రధాని ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారు కానీ మణిపూర్‌లో పర్యటించడం లేదని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ విమర్శించారు. ఇంత జరిగినా కూడా ప్రధాని మోడీ, మణిపూర్ ముఖ్య మంత్రిలు జవాబుదారీతనం వహించేందు కు సుముఖంగా లేరని తృణమూల్ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి శశి పంజా విమర్శించారు. తక్షణమే ముఖ్యమంత్రిని గద్దె దిగాల్సిందిగా బిజెపి కోరాలని తమిళనాడు మంత్రి తంగమ్ తెన్నరసు కోరారు.

'మణిపూర్ ఫైల్స్' పేరుతోనూ సినిమా తీయాలి.. : ఉద్ధవ్

ముంబై: మణిపూర్ హింసాకాండపై కేంద్రం, రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వాలపై శివసేన (యుబిటి) అధినేత, మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మణిపూర్‌లో దారుణాలపై 'మణిపూర్ ఫైల్స్' సినిమా తీయాలన్నారు. కశ్మీర్‌లో కంటే మణిపూర్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. మణిపూర్‌లో ఇద్దరు మహిళలను కొందరు వ్యక్తులు నగ్నంగా ఊరేగిస్తున్న వీడియోను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకోకపోయి ఉంటే, ప్రధాని మోదీ నోరు మెదిపేవారు కాదని శివసేన తమ పార్టీ పత్రిక సామ్నాలో విమర్శించింది. ది కశ్మీర్ ఫైల్స్, ది కేరళ స్టోరి పేరుతో సినిమాలు తీశారని, ఇప్పుడు వారు మణిపూర్ ఫైల్స్ పేరుతో సినిమా తీయాలని సూచించింది. మణిపూర్‌లో కనుక బిజెపియేతర ప్రభుత్వం ఉండుంటే ఇప్పుటికి ఆ ప్రభుత్వాన్ని రద్దు చేసేవారని వ్యాఖ్యానించింది. రాజకీయ పరంగా ప్రధాని మోదీకి మణిపూర్‌తో పెద్దగా ప్రయోజనం లేదని, అందుకే అక్కడి ఘర్షణలను ఆయన పట్టించుకోలేదని ఆరోపించింది.

అంతులేని అకృత్యాలు...

- ఇద్దరు అక్కాచెల్లెళ్లపై హత్యాచారం
- నేటికీ నిందితులను అరెస్టు చేయని పోలీసులు
- మహిళను వివస్త్రను చేసి, సజీవ దహనం

ఇంఫాల్ : అంతులేని అకృత్యాలకు మణిపూర్ రాష్ట్రం కేంద్రంగా మారింది. అక్కడి మహిళల కన్నీటి కథలు డబుల్ ఇంజిన్ సర్కార్ వైఫల్యం, కుతంత్రాలను ఎత్తిచూపుతున్నాయి. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ప్రాంతానికి సరిగ్గా 40 కిలోమీటర్ల దూరంలోని రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లో అదే రోజున కుకీ తెగకు చెందిన మరో ఇద్దరు అక్కాచెల్లెళ్లపై సామూహిక అత్యాచారం, హత్య చేసిన ఘటన తాజాగా వెలుగు చూసింది. మృతుల తండ్రి ఇచ్చిన ఫిర్యాదు, మీడియాకు చెప్పిన వివరాల ప్రకారం పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి రెండు నెలలు దాటినా నేటికీ ఎవరినీ అరెస్టు చేయలేదు. 21, 24 ఏళ్ల వయసున్న అక్కాచెల్లెళ్లు ఇంఫాల్‌లోని కార్లు సర్వీస్ చేసే ప్రాంతంలో కేర్‌టేకర్లుగా పనిచేస్తున్నారు. వారు ఇంఫాల్‌లోని మైతీలు ఎక్కువగా ఉన్న కొనుంగ్ మనాంగ్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. 'నా పెద్ద కూతురు స్నేహితురాలు మైతీ తెగకు చెందినది. మేము కుకీలం. మే 4న సుమారు 200 మందితో కూడిన మైతీల గుంపు వారు నివాసం ఉంటున్న ఇంటిపై దాడి చేసింది. వారు అత్యాచారం చేసి, హత్య చేశారు. విషయం తెలియగానే, నేను పోలీసు అధికారితో కలిసి మార్చురీకి వెళ్లాను. డాక్టర్‌తో మాట్లాడగా, వారిద్దరిపై దుండగులు అత్యాచారం చేసి, హత్య చేశారని చెప్పారు. దర్యాప్తు కోసం మృతదేహాలను భద్రపరిచినట్లు తెలిపారు. మైతీ యువజన సంఘాలు, మైతీ లీపున్, కెకెఎల్, అరంబాయ్ టెంగోల్, వరల్డ్ మైతీ కౌన్సిల్ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు భావిస్తున్నట్లు' చెప్పారు. జూన్ 12న నార్త్ అమెరికన్ మణిపూర్ ట్రైబల్ అసోసియేషన్ సభ్యులు, ఇద్దరు మహిళా కార్యకర్తలు ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర అధికారులను సంప్రదించామని, వారి నుంచి ఎటువంటి స్పందన లేదని శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ కమిషన్ ఛైర్‌పర్సన్ రేఖాశర్మ చెప్పారు. మే 16న కాంగ్‌పోక్సి జిల్లా సైకుల్ పోలీస్ స్టేషన్‌లో ఈ కేసును జీరో ఎఫ్‌ఐఆర్‌గా నమోదు చేశారు. పోరంపట్ పోలీస్ స్టేషన్‌కు కేసు బదిలీ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం నేటికీ ఎవరినీ అరెస్టు చేయలేదు. మే 4న జరిగిన ఘోరం తర్వాత 6వ తేదీన మళ్లీ అటువంటి సంఘటనే చోటు చేసుకుంది. 45ఏళ్ళ మహిళను వివస్త్రను చేసి తగలబెట్టారు. ఇంఫాల్ ఈస్ట్‌లో జరిగిన ఈ ఘటనలో ఆమె తగలబడిన ఫోటో సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగుచూసింది. ఈ ఘటనలో అనుమానితుడి ఇంటిని తగలబెట్టేశారు.

యుపిలో ఎబివిపి బీభత్సం

- గోరఖ్‌పూర్‌లో వర్సిటీ విసి, రిజిస్ట్రార్‌పై దాడి

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో యూనివర్సిటీ విసి, రిజిస్ట్రార్‌లపై ఆరెఎస్‌ఎస్ అనుబంధ విద్యార్థి విభాగం ఎబివిపి సభ్యులు దాడి చేశారు. ఆ రాష్ట్ర సిఎం యోగి స్వస్థలంలోనే ఈ ఘటన చోటుచేసుకోవటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు, సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. గోరఖ్‌పూర్‌లోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ విశ్వవిద్యాలయం (డిడియు) వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌ను ఎబివిపి కార్యకర్తలు శుక్రవారం సాయంత్రం వెంబడించి కొట్టారు. ఈ గొడవలో వైస్ ఛాన్సలర్ రాజేష్ సింగ్, రిజిస్ట్రార్ అజయ్ సింగ్, కొందరు పోలీసులు గాయపడ్డారు. అంతటితో ఆగని ఎబివిపి గూండాలు విసి ఛాంబర్‌ను కూడా ధ్వంసం చేశారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు లాఠీచార్జి చేయాల్సి వచ్చింది. పది మంది ఎబివిపి గూండాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఎన్‌సిడబ్ల్యు చైర్‌పర్సన్ తప్పుకోవాలి

- మహిళా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో : మణిపూర్ మహిళలపై అఘాయిత్యాలకు సంబంధించి ఫిర్యాదులందినప్పటికీ, జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు) చర్యలు తీసుకోకపోవడం పట్ల మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. బాధ్యులైనవారిపై చర్య తీసుకోవడంలో విఫలమైనందున ఎన్‌సిడబ్ల్యు ఛైర్‌పర్సన్ రేఖాశర్మ వెంటనే ఆ పదవి నుంచి తప్పుకోవాలని అవి డిమాండ్ చేశాయి. ఐద్వా, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు, ఎఐపిడబ్ల్యుయుఎ, ఎఐఎంఎస్‌ఎస్, ఎఐఎఎంఎస్, ఎఐసిపిపిఐ తదితర మహిళా సంఘాలు శనివారం ఈ మేరకు సంయుక్తంగా ఆమెకు ఒక లేఖ రాశాయి. మణిపూర్‌లో ముగ్గురు మహిళలను వివస్త్రలను చేసి, నగ్నంగా ఊరేగిస్తూ అత్యాచారానికి పాల్పడిన దారుణ ఘటనకు సంబంధించి ఎన్‌సిడబ్ల్యుకి జూన్ 12న ఫిర్యాదు అందినప్పటికీ, నెల రోజులకు పైగా ఏమీ పట్టనట్లు వ్యవహరించడంపై మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.కొద్దిరోజుల క్రితం క్రూరమైన హింసకు సంబంధించిన వీడియో బయటకు వచ్చినప్పుడు, దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమైనతరువాత కానీ ఎన్‌సిడబ్ల్యు కళ్లు తెరవలేదని ఈ సంఘాలు విమర్శించాయి. 'మే 3న హింస ప్రారంభమైన వెంటనే, మే 4న జరిగిన ఘటనపై ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేయడం మినహా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోందని ఆ లేఖలో పేర్కొన్నాయి. బాధితుల పట్ల పోలీసుల ఉదాసీనత, నేరానికి పాల్పడిన వారితో కుమ్మక్కు కావడం స్పష్టంగా కనిపించిదని పేర్కొన్నాయి.. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ చేష్టలుడిగినట్టు వ్యవహరించారని విమర్శించాయి. ఎన్‌సిడబ్ల్యు తన బాధ్యతను విస్మరించిందని, ఉద్దేశపూర్వకంగానే దీనిని కప్పిపుచ్చడానికి ప్రయత్నించిందని తాము గట్టిగా అభిప్రాయపడు తున్నామని పేర్కొన్నాయి. దేశంలోని మహిళలను రక్షించడం, వారి హక్కులను సమర్థించే విధిగా బాధ్యత వహించే ఎన్‌సిడబ్ల్యు వంటి సంస్థ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం' అని విమర్శించాయి. ఎన్‌సిడబ్ల్యు ఛైర్‌పర్సన్‌గా ఈ అవమానకరమైన పరిస్థితికి తాము మిమ్మల్ని బాధ్యులుగా భావిస్తున్నాం. అనర్హులుగా నిరూపించుకున్న మీరు వెంటనే పదవికి రాజీనామా చేయాలి అని డిమాండ్ చేశాయి.

మధ్యప్రదేశ్‌లోనూ బుల్డోజర్ రాజ్

(మొదటి పేజీ తరువాయి)

పంపామని హుస్సేన్ చెప్పారు. పోలీసు స్టేషన్‌లో పరిస్థితి భయంకరంగా వుందన్నారు. తమ పిల్లలను కస్టడీలోకి తీసుకున్నారని తెలియగానే దుకాణాలు మూసివేసి వెళ్లామని చెప్పారు. వారికి బెయిల్ కూడా ఇవ్వలేదన్నారు.

ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత 19న హుస్సేన్ ఇంటిని జిల్లా పాలనా యంత్రాంగం కూల్చివేసింది. ఆ ఇల్లు అక్రమ నిర్మాణమని అందుకే కూల్చివేస్తున్నామని 18న నోటీసు ఇచ్చారు. ఆ నోటీసులో 'అక్రమ నిర్మాణం' అని రాసిన చోట 'ప్రమాదకరమైన భవనం' అని మార్చారు. కేవలం అరగంట వ్యవధి ఇచ్చి కూల్చివేశారని, ఇంట్లో సామాను తీసుకోవడానికి ఆ సమయం సరిపోతుందా అని ఆయన ప్రశ్నించారు. తమది చట్టబద్ధంగానే కట్టిన ఇల్లు అని, అన్ని అవసరమైన పత్రాలు, అనుమతులు చూపించామని చెప్పారు.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.
టెండర్ నోటీసు నం.సి/ఎస్/టి/36/5/385 కు సవరణ
PUB/0806

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.
ఇ-టెండరు ఆహ్వాన ప్రకటన (http://ireps.gov.in)
PUB/0818
భారత రాష్ట్రపతి తరపున, సిఇ/సి-2/ఎస్‌సి, సిఇ/సి-3/ఎస్‌సి, సిఇ/సి-5/ఎస్‌సి & సిఇ/సి/ప్లానింగ్ & సర్వే/ఎస్‌సి నిర్మాణ సంస్థ, ద.మ.రైల్వే, సికింద్రాబాద్, వారు వరుసగా దిగువ పనుల కొరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.
క్ర.సం.: 1, నిట్ నం.: పిఎస్‌ఎస్-01-సిఎఐ-సి-ఎస్‌సి-2023, తేది: 07.07.2023, పని పేరు: ద.మ.రైల్వేలో సిఇ/సి-3/ఎస్‌సి పరిధిలో డిప్యూటీ సిపిఎం/డబ్ల్యుసిఎస్‌పి/ఎస్‌సి లో వివిధ నిర్మాణ సైట్లు/సెక్షన్ల వద్ద ప్రాజెక్ట్ సూపర్‌వైజన్ సేవలు (పిఎస్‌ఎస్) సమకూర్చుట. వివరాలు: అంచనా ధర: రూ.1,27,41,837.92 పై.లు, ధరావత్తు: రూ.2,13,700/-, పూర్తిచేయు కాలవ్యవధి: 18 (పద్దెనిమిది) నెలలు.

టెండర్ నోటీసు నం.జి/ఇ.29/టిఆర్./టెండర్ నోటీసు/08/2023-24.
PUB/0811
భారత రాష్ట్రపతి మరియు సీనియర్ డివిజనల్ ...

PUB/0812
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/(ట్రాక్షన్), గుంతకల్లు.

మీకోసం

మటన్ కూరలో మసాలాతో పాటు నానబెట్టిన పచ్చికొబ్బెర, నువ్వులు, జీడిపప్పును మెత్తగా పేస్ట్ చేసి వేస్తే రుచిగా ఉంటుంది.

జీవన సౌరభం

అజ్ఞానం కన్నా నిర్లక్ష్యమే ఎక్కువ నష్టాన్ని కలిగిస్తుంది.

ఉడత చెలిమి

ఉడతా..ఉడతా రావమ్మా
మాతో స్నేహం చేయమ్మా
ఊసులు ఎన్నో చెప్పమ్మా
చక్కని కబుర్లు ఆడమ్మా
గింజలు నీకు ఇస్తాము
దండిగా పండ్లు పెడతాము
మా తోటను నీకు ఇస్తాము

చెట్లు, చేమలు తిరుగుతూ
ఊడలు, తీగలు ఊగుతూ
కొమ్మలు, రెమ్మలు గెంతుతూ
వాగులు, వంకలు దాటుతూ

మాతోనే నీవు తిరుగుతూ
ఆనందంగా గడుపుతూ
కల కాలం కలిసుందాము
కమ్మని స్నేహం మనదందాం!

– కయ్యూరు బాలసుబ్రమణ్యం,
77802 77249

జత చేయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి కింద అంకెలు ఉన్నాయి. బొమ్మలకు సరిపోయే అంకెను జత చేయండి మరి.



సరైన క్రమంలో రాయండి

పిల్లలూ, బొమ్మ చుట్టూ ఉన్న అక్షరాలను సరైన క్రమంలో రాస్తే మధ్యలో ఉన్న బొమ్మ పేరు వస్తుంది. ట్రై చేయండి మరి.

నేను గీసిన బొమ్మ

- టి.గోమతి ప్రియ,
10వ తరగతి,
అరవింద హైస్కూలు, మంగళగిరి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పేదరికాన్ని ఎదిరించి డాక్టరేట్ సాధించిన భారతి

ఆకలి బాధలని... అసమానతలను, అవమానాలను అధిగమించి మెరిసిన మట్టిలో మాణిక్యం భారతి. ఆడపిల్లగా పుట్టినందుకు చిన్నతనంలోనే తండ్రి చీదరింపులు... పూటగడవటమే కష్టమైన పేదరికపు ఆకలి బాధలు... వీటన్నింటినీ అధిగమించి ఉన్నత చదువుకు చేరుకునే సరికి తక్కువ కులం వారికి ఉన్నత చదువులేలా అన్న హేళనలు.. ఇవేవీ ఆమె జీవిత ఆశయానికి అడ్డురాలేదు. తాను అనుకున్నది సాధించడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకుని జీవన పోరాటాన్ని సాగించింది. ఆమె ఆశయానికి తాతయ్య, మామయ్య (భర్త) తోడ్పాటు తోడవడంతో క్లిష్టతరమైన రసాయన శాస్త్రంలో డాక్టరేట్‌ను పూర్తి చేసింది. తన తాతయ్య సుంకన్న కోరిక, పేరును నిలబెట్టింది. 'చదువుకుని నా పేరు నిలబెట్టాలి బిడ్డా..' అని తాతయ్య ఎప్పుడూ అనేవాడు. ఈ రోజు ఆయన కల నిజం చేశాను' అంటూ భారతి చెబుతున్నప్పుడు ఆనందంతో ఆమె కళ్లు వర్షించాయి.

పట్టుదల వుంటే మనుషులు రుషులవుతారో.. లేదో.. కానీ డాక్టరేట్ సాధిస్తారని అనుభవపూర్వకంగా నిరూపించింది భారతి. కట్టుకోవడానికి మంచి చీరైనా లేని పరిస్థితుల్లో చిరిగిన, మాసిన బట్టలతోనే కాలేజీకి వెళ్లేది. ఒక రోజు కాలేజీ.. ఇంకో రోజు కూలీకెళ్తేనే కుటుంబం గడిచే పేదరికంలో చదువుకోసం పడరాని పాట్లు పడింది. పేదరికంలో పుట్టి ఎన్నో దుర్భర పరిస్థితులను దాటుకుని రసాయనశాస్త్రంలో పిహెచ్‌డి పట్టా సాధించిన సాకే భారతి గురించే ఇప్పుడు మనం చెప్పకుంటోంది. ఈ విజయంలో భారతి భర్త పాత్ర కూడా గొప్పది. ఆమెకి చేదోడువాదోడుగా నిలిచాడు. భార్య చదువు కోసం రేయింబవళ్లు కష్టపడ్డాడు. ఈ రోజు ఆమె విజయం గురించి అందరూ మాట్లాడుతున్నారు కానీ.. ఈ విజయం వెనుక వారు పడ్డ అవమానాలు.. అవహేళనలు ఎన్నో ఉన్నాయి.

ఆడపిల్ల అన్న చీదరింపులు

అనంతపురం జిల్లా గుత్తి మండలం సూరసింగనపల్లి భారతి స్వస్థలం. 'మా అమ్మకు ముగ్గురు ఆడపిల్లలు. మగపిల్లలు పుట్టలేదని చీదరింపు మాటలతో పాటు మద్యం సేవించి వచ్చి నాన్న అమ్మని తిట్టేవాడు, కొట్టేవాడు. అది చూడలేక మా తాతయ్య నన్ను ఇక్కడికి అంటే శింగనమల మండలం నాగులగూడెం గ్రామానికి తీసుకొచ్చారు. తాతయ్య ఏడో తరగతి వరకు చదువుకున్నాడు. చదువు విలువ బాగా తెలుసు. అమ్మ పరిస్థితి ఇలా అయ్యిందని ఎప్పుడూ బాధపడేవాడు. అందుకే 'ఒక్క పాపనైనా బాగా చదివించి అమ్మాయిలంటే ఏమిటో మీ నాన్నకు చూపించాలి' అని అంటుండేవాడు' అంటూ తాతయ్య గురించి చెబుతున్నప్పుడు భారతి కళ్లు దు:ఖంతో వర్షించాయి.

'ఎరుకుల తెగకు చెందిన మాలో ఆడపిల్లలను చదివించే వారే ఉండరు. ఎప్పుడు పెళ్లి చేద్దామా.. పంపించేద్దామా.. అన్నట్లు వుంటారు. పెళ్లయి ఆ బిడ్డ పడరాని పాట్లు పడుతున్నా పట్టించుకునే వారు కూడా ఉండరు. అటువంటి పరిస్థితిల్లో నాకు కూడా పదవ తగరతి పూర్తవుతూనే పెళ్లి చేశారు. వేరే వాళ్లకిచ్చి పెళ్లి చేస్తే వారు చదివిస్తారో లేదోనన్న ఉద్దేశంతో మా అమ్మ తన తమ్ముడికే ఇచ్చి పెళ్లి చేశారు. తాతయ్య లక్ష్యానికి తోడు మా మామయ్య ప్రోత్సాహం కూడా ఉండబట్టే నేను ఇది సాధించాను. నా చదువు కోసం మామయ్య చాలా కష్టపడ్డాడు' అంటూ భర్త ఇచ్చిన మద్దతు గురించి ఆమె చెబుతోంది.

రెక్కాడితేగాని డొక్కడని పరిస్థితిలో భర్త శివ ప్రసాద్ స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో దినసరి కూలీగా వెళుతున్నాడు. 'పదో తరగతిలో మా గ్రామం నుండి 40 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. భారతి ఒక్కటే మంచి మార్కులు సాధించింది. అప్పుడే అనుకున్నాను. ఈమె చాలా తెలివిగలది, చదివించాలని. అందుకే ఎన్ని కష్టాలు ఎదురైనా చదువు మాన్పించలేదు. పగలు ఒక్కపూట పనికెళ్తే కుటుంబం గడిచేది కాదు. రాత్రుళ్లు కూడా పనిచేసేవాడ్ని. ఉండటానికి ఇల్లు లేని పరిస్థితిలో రేకులు, డేరాలు అడ్డుపెట్టుకునే ఉంటున్నాం. ఈ పేదరికం పోవాలంటే, మా పరిస్థితిలో మార్పు రావాలంటే చదువు ఒక్కటే మార్గమని భావించాను. అందుకే భారతిని చదివించాను. పట్టుదలతో చదివి విజయం సాధించింది' అంటూ భార్య గొప్పతనాన్ని చెబుతున్నాడు ప్రసాద్.

భర్తతో పాటు భారతి కూడా వ్యవసాయ కూలీగా వెళ్లేది. భార్యాభర్త ఇద్దరు కష్టపడినా అరకొర ఆదాయమే వచ్చేది. పుస్తకాలు కొనేందుకు కూడా డబ్బులు ఉండేవి కావు. పస్తులు పడుకునేవారు. ఇన్ని కష్టాలు పడుతున్న భారతిని చూసి తోటివారు 'నీకెందుకు ఈ చదువు. పెళ్లయినదానివి ఇవన్నీ అవసరమా? మొగుడు, బిడ్డతో హాయిగా ఉండక, ఎందుకీ అనవసర ప్రయత్నాలు' అని హేళన చేసేవారు. ఊళ్లోనే కాదు.. విశ్వవిద్యాలయంలో కూడా ఆమెకి జరిగిన అవమానాలు ఎన్నో ఉన్నాయి.

మీ మొహాలకు పిహెచ్‌డి కావాలా?

ఇంటర్, డిగ్రీ, పీజీతో పాటు బియిడి కూడా చేసిన భారతి చదువు కోసం ఒక్కో రోజు ఒక్కో కష్టం పడింది. బస్సు చార్జీలకు డబ్బుల్లేక కిలోమీటర్ల దూరం నడిచేది. ఒక రోజు కూలికి వెళ్లి ఆ డబ్బులతో రెండో రోజు కాలేజీకి వెళ్లిన రోజులున్నాయి. పగలంతా పొలంలో పనిచేసి రాత్రుళ్లు చదువుకునేది. భర్త, బిడ్డ ఆలనాపాలనతో పాటు పశువుల పోషణ కూడా చేసేది. ఇన్ని కష్టాలు పడుతూనే పిహెచ్‌డి చేసేందుకు పరీక్ష రాసి భారతి ఉత్తీర్ణురాలైంది.

అయితే 'పిహెచ్‌డిలో చేరడానికి వెళ్లిన నాకు కొంత మంది అధ్యాపకుల నుంచి అవహేళనలు ఎదురయ్యాయి. మీ మొహాలకు పిహెచ్‌డి సీటు కావాలా..! అన్న మాటలకు దు:ఖం వచ్చింది. అయినా అర్హత ఉండి ఎందుకు సీటు ఇవ్వరంటూ మామయ్య నిరసన తెలియజేశాడు. ఇక సీటు ఇవ్వక తప్పదనుకున్న సమయంలో కొంత మంది వచ్చి రూ.50 వేలు డబ్బులిస్తాం, ఆ సీటు అడగవద్దన్న ఆఫర్ ఇచ్చారు. అయితే నాకు తెలుసు.. 'డబ్బులు కూలి పని చేసైనా సంపాదించుకోగలం.. చదువు డబ్బుతో రాదు కదా' అదే వారితో చెప్పి సీటు దక్కించుకున్నా.

విద్యాభ్యాసం ఇలా కొనసాగింది..

ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోనూ, ఆరు నుంచి పదవ తరగతి వరకు శింగనమల మండలం కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో చదువు పూర్తిచేసింది. పామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాక, గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ అనంతపురం ఎస్ఎస్‌బిఎన్‌లో చదివింది. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన 21వ స్నాతకోత్సవంలో రసాయన శాస్త్రంలో పిహెచ్‌డిని పూర్తి చేసి పట్టాను పొందింది.

అర్హతకు తగ్గ ఉద్యోగం కావాలి..

పిహెచ్‌డి పట్టా తీసుకున్న తరువాత కూడా భారతి కూలిపనులకు వెళ్తోంది. అర్హత గల ఉద్యోగం కోసం ఎదురుచూస్తోంది. 'కష్టాలు నాకు కొత్త కాదు.. చదువు కోసం కష్టపడ్డాను. కానీ ఇప్పుడు ఉద్యోగం కోసం కూడా కష్టపడాల్సి వస్తోంది. ఉద్యోగం సాధించడం వల్ల నా వ్యక్తిగత జీవితం బాగుపడడమే కాదు, నాలాంటి వారెందరికో స్ఫూర్తిగా నిలుస్తుంది' అంటున్న భారతి ప్రొఫెసర్ కావడమే తన జీవిత లక్ష్యమని, అది సాధించే వరకు మరింతగా కష్టపడటానికి కూడా సిద్ధంగానే ఉన్నానని బలమైన నమ్మకంతో చెబుతోంది.

– ఎ.షఫీఉల్లా,
ప్రజాశక్తి ప్రతినిధి,
అనంతపురం.

కొనసాగుతున్న

అమెరికా రచయితలు, నటీనటుల సమ్మె

లాస్‌ఏంజెల్స్: వినోద రంగంలో దిగ్గజ కంపెనీలకు వ్యతిరేకంగా పదివేల మంది అమెరికన్ రచయితలు, నటీ నటులు చేపట్టిన చారిత్రాత్మక సమ్మె కొనసాగుతోంది. మూడేళ్లకొకసారి జరిగే కాంట్రాక్టు ఒప్పందంలో పెరిగిన ధరలకు అనుగుణంగా తమకు మొదటి సంవత్సరం 11 శాతం, రెండవ సంతవ్సరం 4 శాతం, మూడో సంవత్సరం 4 శాతం వేతన పెంపుదల ఉండాలని హాలీవుడ్‌కు చెందిన రచయితలు, నటీ నటులు, స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్, అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ టెలివిజన్ అండ్ రేడియో ఆర్టిస్టు (ఎస్ఎజి–ఎఎఫ్‌టిఆర్ఎ) కోరుతుంటే, యజమాన్యాల అసోసియేషన్ (ఎఎంపిటిటిపి) మొదటి ఏడాది5 శాతం, రెండవ ఏడాది4 మూడవ ఏడాడి 3 శాతం మాత్రమే చెల్లిస్తానని మొండికేసింది. ప్రస్తుతం చర్చల్లో ప్రతిష్టంభన నెలకొంది. పరిష్కారం కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఈ సమ్మె వారాలు గడచి నెలల తరబడి సాగేలా ఉంది. ఈ సమ్మెను విఫలం చేయడానికి బైడెన్ ప్రభుత్వం అన్ని రకాలుగా దాడి చేస్తోంది. హాలీవుడ్ పరిశ్రమలో సమ్మెకు ఒక దేశం తరువాత ఒక దేశంలోని కార్మికవర్గం మద్దతు తెలుపుతున్నది. చలన చిత్ర, టెలివిజన్, మీడియా దిగ్గజ సంస్థలు తమ వర్క్‌ఫోర్స్(సిబ్బంది)ని గిగ్ వర్కర్ల స్థితికి కుదించివేసి, తమ లాభాలను గరిష్ట స్థాయికి పెంచుకోవాలని చూస్తున్నాయి. అమెజాన్ కంపెనీలో పని పరిస్థితులు దారుణంగా ఉన్నాయి.కార్మికుల చేత యాజమాన్యం గొడ్డు చాకిరీ చేయించుకుంటున్నది. కనీసం బాత్రూమ్‌కు వెళ్లి రావడానికి కూడా వీల్లేనంతగా పని ఒత్తిడి పెంచుతోంది. వేతనాల దగ్గరకొచ్చేసరికి అరకొర వేతనాలు చెల్లించి చేతులు దులిపేసుకుంటున్నది. లాస్‌ఏంజిల్స్ టైమ్ పత్రిక ప్రచురించిన కథనం ప్రకారం హాలీవుడ్ టాప్ ఎగ్జిక్యుటివ్‌ల సగటు వేతనం 2021లో 28 మిలియన్ల డాలర్లు. అంటే రచయితల వేతనానికి దాదాపు 108 రెట్లు ఎక్కువన్న మాట. దీనికి వ్యతిరేకంగా న్యూయార్క్‌లోని నెట్ ఫ్లిక్స్ ప్రధాన కార్యాలయం ఎదుట 300 మంది నటీనటులు, రచయితలు పికెటింగ్ నిర్వహించారు. వీరికి రవాణా రంగ కార్మికులు హారన్ మోగిస్తూ తమ సంఘీభావం తెలియజేశారు.పాదచారులు కూడా వీరికి మద్దతుగా నిలిచారు. హాలీవుడ్‌లోని కార్పొరేట్ కంపెనీల దాడిని తిప్పికొట్టేందుకు అమెరికన్ రచయితలు, నటీనటులు సాగిస్తున్న పోరాటానికి సంఘీభావంగా లండన్, మాంఛెస్టర్‌లో కార్మికవర్గం ప్రదర్శనలు నిర్వహించింది.

కేరళ ప్రభుత్వ స్కూల్‌లో చేరిన

మణిపూర్ చిన్నారి జెజెమ్

అన్ని విధాలా ఆదుకుంటాం : మంత్రి వి శివన్ కుట్టి

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్‌లోని హింసాత్మక ప్రాంతానికి చెందిన బాలిక కేరళ ప్రభుత్వ పాఠశాలలో చేరింది. హెూనీజెమ్ వైఫే ముద్దుగా 'జెజెమ్' అని పిలిచే విద్యార్థిని తిరువనంతపురం థైకాడ్ గవర్నమెంట్ మోడల్ ఎల్‌పి స్కూల్‌లో రెండో తరగతిలో అడ్మిషన్ పొందింది. పాఠశాలను సందర్శించిన విద్యాశాఖ మంత్రి వి శివన్‌కుట్టి, జెజెమ్‌ను కలిశారు. 'జెజెమ్‌ను వ్యక్తిగతంగా కలుసుకున్నప్పుడు, ఆమె కేరళ కల్పిస్తున్న భద్రతా భావాన్ని తెలియజేసింది. డియర్ జెజెమ్, కేరళ ప్రశాంతంగా జీవించడానికి, చదువుకోవడానికి మంచి ప్రదేశం. తదుపరి చదువుల కోసం అన్ని సహాయాలు అందిస్తాం' అని శివన్ కుట్టి తెలిపారు. మణిపూర్‌లోని కాంగ్‌పోక్పి జిల్లాలోని నకుజుంగ్ గ్రామంలో జెజెమ్ ఇల్లు మైతీల హింసాకాండలో దగ్ధమైంది. మాంగ్‌డోయ్, అచోయ్‌ల రెండో కుమార్తెగా జెజెమ్ జన్మించింది. వారి కుటుంబం దీనస్థితిని గుర్తించి జెజెమ్‌ను తిరువనంతపురంలోని కవడియార్‌లో ఆదాయపు పన్ను కార్యాలయంలో పనిచేస్తున్న ఆమె బంధువు లుంబి చియాంగ్ కేరళకు తీసుకొచ్చారు.

ఛ్ఛ్.. చేజేతులా..!

బంగ్లాదేశ్ మహిళలతో జరిగిన మూడో వన్డే టై వన్డే సిరీస్ 1–1తో సమం

ఢాకా: బంగ్లాదేశ్ మహిళలతో జరిగిన మూడో, చివరి వన్డే టై అయ్యింది. బంగ్లాదేశ్ మహిళలజట్టు నిర్దేశించిన 226పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారతజట్టు 225పరుగులకు కుప్పకూలింది. ఛేదనలో భాగంగా భారత్ 6వికెట్ల నష్టానికి 212పరుగులు చేసి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించింది. మరో 14పరుగులు చేస్తే సిరీస్ మనదే అనుకున్న దశలో 5పరుగుల వ్యత్యాసంలో మూడు వికెట్లు కోల్పోయి ఓటమి కోరల్లో నిలిచింది. ఆ దశలో చివరి వికెట్‌కు రోడ్రిగ్స్–మేఘ్న సింగ్ కలిసి లక్ష్యానికి చేరువ చేశారు. మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠగా సాగుతుండగా.. 48.5వ బంతిని మేఘ్న ఫోర్ కొట్టి గెలుపుపై ఆశలు కల్పించింది. చివరి 3బంతుల్లో మరో పరుగు చేస్తే గెలుపు మనదే అనుకున్నకుంటుండగా.. బంగ్లా బౌలర్ మరుఫా అక్తర్ వేసిన బౌలింగ్‌లో వికెట్ కీపర్ నిగర్ సుల్తానాకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యింది. దీంతో మ్యాచ్ టై కాగా.. బంగ్లా అమ్మాయిలు సంబరాల్లో మునిగారు. ఈ మ్యాచ్‌లో పసికూన బంగ్లాదేశ్ అమ్మాయిల పోరాట పటిమ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ మ్యాచ్‌కు ముందు జరిగిన తొలి రెండు వన్డేల్లో ఇరుజట్లు ఒక్కో మ్యాచ్ గెలుపొందడంతో సిరీస్ 1–1తో సమమైంది. ఢాకాలో చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ మహిళలజట్టు నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లకు 225 పరుగులు చేసింది. ఫర్గానా హక్, షమీమా బ్యాటింగ్‌లో రాణించారు. బంగ్లాదేశ్ ఓపెనర్ ఫర్గానా హక్(160 బంతుల్లో 7 ఫోర్లు 107) సెంచరీతో చెలరేగగా.. మరో ఓపెనర్ షమీమా సుల్తానా(78 బంతుల్లో 5 ఫోర్లతో 52) అర్ధ సెంచరీతో రాణించారు. భారత బౌలర్లలో స్నేహ్ రాణా రెండు వికెట్లు తీయగా.. దేవికా వైద్యకు ఒక వికెట్ దక్కాయి. అనంతరం లక్ష్యఛేధనకు దిగిన భారత్ 49.3 ఓవర్లలో 225 పరుగులకే ఆలౌటైంది. స్మృతి మంధానా(85 బంతుల్లో 5 ఫోర్లతో 59), హర్లీన్ డియోల్(108 బంతుల్లో 9 ఫోర్లతో 77) అర్ధ సెంచరీలతో రాణించగా.. జెమీమా రోడ్రిగ్స్(45బంతుల్లో 33నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడింది. చివర్లో టెయిలెండర్లు సాయంతో గెలుపు తీరాలకు చేర్చినా ప్రయోజనం లేకపోయింది. బంగ్లా బౌలర్లో నహిదా అక్తర్(3/37) మూడు వికెట్లు తీయగా.. మరుఫా అక్తర్ రెండు వికెట్లు పడగొట్టారు. సుల్తానా ఖాటున్, రాబెయ ఖాన్, ఫహిమా ఖాటున్ తలో వికెట్ తీసారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హర్లిన్ డియెల్‌కు, సిరీస్ ఫర్గానా హక్‌కు లభించాయి.

టోరీలకు గట్టి ఎదురుదెబ్బ

● బ్రిటన్ సంక్షోభం ఎఫెక్టు ● ఉప ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ

లండన్: ఇటీవల మూడు పార్లమెంటు స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో కన్సర్వేటివ్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మూడేళ్ల క్రితం స్వీప్ చేసిన ఈ మూడు స్థానాల్లో రెండింటిని ఇప్పుడు ఆ పార్టీ కోల్పోయింది. మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ ప్రాతినిధ్యం వహించిన నార్త్ వెస్ట్ లండన్ స్థానంలో స్వల్ప ఆధిక్యతతో అది బయటపడింది. సెల్బీ, ఎయిన్‌స్టీ స్థానాన్ని ప్రధాన ప్రతిపక్షమైన లేబర్ పార్టీ భారీ మెజార్టీతో గెలుచుకోగా, సామర్టన్ అండ్ ఫ్రోమ్ స్థానాన్ని లిబరల్ డెమొక్రటిక్ పార్టీ చేజిక్కించుకుంది. మొత్తం మీద ఈ ఫలితాలు అక్కడి సంక్షోభ తీవ్రతను తెలియజేస్తున్నాయి. టోరీ పార్టీ (కన్సర్వేటివ్స్‌కు మరో పేరు) కోల్పోయిన రూరల్ స్థానాలు రెండూ ఆ పార్టీకి గుండెకాయలాంటివి. అటువంటి స్థానాల్లో చిత్తుగా ఓడిపోవడం అధికార పార్టీపై ప్రజల్లో గూడుకట్టుకున్న ఆగ్రహానికి సంకేతంగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

చాలామంది టోరీ ఓటర్లు ఎన్నికల పోలింగ్ రోజున ఓటు వేయడానికి వెళ్లకుండా ఇంటిపట్టునే ఉండిపోయారు. ఇది కన్సర్వేటివ్ పార్టీ పట్ల వారిలో నెలకొన్న నిర్లిప్తతకు ఒక మచ్చుతునక. 2019 ఎన్నికలతో పోల్చితే ఈ సారి 20, 532 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఫలితంగా టోరీలకు పోలైన ఓట్లు గతంతో పోల్చితే 21, 700 దాకా తగ్గాయి. లేబర్ పార్టీకి 3,000 ఓట్ల దాకా తగ్గాయి. లిబరల్ డెమొక్రాట్ల పరిస్థితి కూడా ఇంచుమించు ఇదే విధంగా ఉంది. రిషి సునాక్ నేతృత్వంలోని కన్సర్వేటివ్ ప్రభుత్వం బ్యాంకుల, బహుళజాతి సంస్థలకు తాబేదారుగా వ్యవహరించడం, వాటర్ కంపెనీల ప్రైవేటీకరణ, వడ్డీ రేట్ల పెంపు, ద్రవ్యోల్బణం, అద్దెలు విపరీతంగా పెరిగిపోవడం, నిజ వేతనాలు పడిపోవడం వెరసి ప్రజల జీవన ప్రమాణాలు దారుణంగా దిగజారాయి. కన్సర్వేటివ్స్ పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను సొమ్ము చేసుకోగలిగే స్థితిలో లేబర్ పార్టీ లేదు. తాము అధికారంలోకి వస్తే వేతనాలను సవరిస్తామని, ధరలు తగ్గిస్తామని, పర్యావరణాన్ని కాపాడతామని స్పష్టమైన హామీ ఇవ్వడానికి అది సిద్ధంగా లేదు. సరైన ప్రత్యామ్నాయంతో లేబర్ పార్టీ గనుక ముందుకు వస్తే బ్రిటన్ ప్రజలు దానిని తప్పక ఆదరిస్తారు. ఇప్పుడున్న లేబర్ పార్టీ నాయకత్వానికి అటువంటి సామాజిక దృక్పథమేదీ ఉన్నట్లు కనిపించడం లేదు.

కొనసాగుతున్న వర్ష బీభత్సం!

● మహారాష్ట్రలో 110మందిని కాపాడిన వైమానిక దళం

న్యూఢిల్లీ, ముంబయి : గత కొద్ది రోజులుగా భారీ వర్షాలు, వరదలతో దేశంలో పలు ప్రాంతాలు అతలాకుతలమవుతున్నాయి. కుండపోత వర్షాలతో పలు నదులు ఉధృతంగా పొంగి పొర్లుతున్నాయి. దేశ రాజధానిలో యమునా నది ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది. గత కొద్ది రోజులుగా 205.33 మీటర్ల మార్క్‌ను దాటుతోంది. శనివారం ఉదయం కూడా పరిస్థితి ఇలానే వుంది. ఉత్తరాఖండ్‌లో కూడా పలు చోట్ల వర్షాలు పడుతుండడంతో మళ్లీ నదిలో నీటి మట్టం పెరిగే అవకాశం వుంది. దీనివల్ల ఢిల్లీలో వరదలకు దెబ్బతిన్న పల్లపు ప్రాంతాల్లో పునరావాస చర్యలకు జాప్యం జరుగుతోంది. 25వ తేదీ వరకు ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో భారీ వర్షాలు కురియగలవని వాతావరణ అధికారులు చెప్పారు. శనివారం ముంబయి, దాని శివారు ప్రాంతాల్లో భారీగా వర్షాలు పడడంతో పలుచోట్ల నీరు నిలిచిపోయి ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. రాబోయే రెండు రోజుల్లో పాల్ఘర్, థానే, రాయ్‌గఢ్, రత్నగిరి, సింధుదుర్గ్ జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు పడే అవకాశం వుందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. ముంబయి నగరానికి ఆరంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. పాల్ఘర్, థానేల్లో శనివారం పాఠశాలలు మూసివేశారు. ములుంద్, థానే, భివాండి, కల్యాణ్ ప్రాంతాల్లో ప్రజలెవరూ బయటకు రాకుండా ఇళ్లకే పరిమితం కావాలని అధికారులు ఆదేశించారు. మహారాష్ట్రలోని యవత్మాల్‌లో, జమ్మూ కాశ్మీర్‌లోని దోడా జిల్లాలో చిరాల ప్రాంతాల్లో భారీ వర్షాలు పడడంతో వరద తరహా పరిస్థితి నెలకొంది. యవత్మాల్‌జిల్లాలోని మహాగన్ తాలుకాలో కుండపోత వర్షాల కారణంగా వరదలు సంభవించాయి. 110మందికి పైగా ఈ వరదల్లో చిక్కుకుపోయారు, వారిని భారత వైమానిక దళానికి చెందిన రెండు హెలికాప్టర్లు, రాష్ట్ర విపత్తు నిర్వహణా దళానికి చెందిన బలగాలు కాపాడాయి. శుక్రవారం నుండి ఇక్కడ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. యవత్మాల్ జిల్లా మహాగన్ తాలుకాలో రికార్డు స్థాయిలో 231 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో వారు వరదనీటిలో చిక్కుకున్నారని జిల్లా కలెక్టర్ అయోల్ యెడ్జ్ తెలిపారు.

భారత్-ఎ, పాకిస్తాన్-ఎ అమీ తుమీ

ఎసిసి ఎమర్జింగ్ ఆసియాకప్ ఫైనల్ నేడు

మధ్యాహ్నం 2.00గం॥ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

కొలంబో: ఎసిసి ఎమర్జింగ్ ఆసియాకప్ ఫైనల్లో మరో ఉత్కంఠ సమరం జరగనుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్–ఎ జట్టు పాకిస్తాన్–ఎతో తలపడనుంది. లీగ్ దశలో సునాయాసంగా పాకిస్తాన్–ఎను ఓడించిన భారత్.. సెమీస్‌లో బంగ్లాదేశ్–ఎపై గెలిచేందుకు చెమటోడ్చాల్సి వచ్చింది. సెమీస్‌లో ఎదురైన సవాళ్లను ఎలా అధిగమించిందో అదే ప్రతిభనూ ఫైనల్లోనూ కనబర్చాల్సిన అవసరమెంతైనా ఉంది. బంగ్లాదేశ్‌తో జరిగిన సెమీస్‌లో భారత్ 211పరుగులే చేసినా బంగ్లాదేశ్‌ను 160పరుగులకు కట్టడి చేసిన తీరు అమోఘం. మరోవైపు పాకిస్తాన్ జట్టు శ్రీలంకపై భారీస్కోర్ చేసి దుర్భేధ్యఫామ్‌లో ఉంది. ఆ జట్టు శ్రీలంక–ఎపై 322పరుగులు చేసింది. ఆ జట్టుపై 60పరుగుల తేడాతో గెలిచి ఫైనల్‌కు చేరింది. ఈ క్రమంలో పాక్ జట్టును ఏమాత్రం తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఇక భారత్–ఎ జట్టు టైటిల్‌ను సాధిస్తే రికార్డుస్థాయిలో 8వ సారి చేజిక్కించుకున్నట్లవుతుంది.

వెస్టిండీస్ 171/3

ట్రినిడాడ్: రెండోటెస్ట్‌లో వెస్టిండీస్ జట్టు బ్యాటర్స్ రాణించారు. తొలి టెస్ట్‌లో ఇన్నింగ్స్ తేడాతో ఓడిన వెస్టిండీస్ జట్టు రెండోటెస్ట్‌లో రెండోరోజు 84ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 171పరుగులు చేసింది. ఓపెనర్, కెప్టెన్ బ్రాత్‌వైట్(75; 235బంతుల్లో 5ఫోర్లు, సిక్సర్) అర్ధసెంచరీతో కదం తొక్కాడు. బ్లాక్‌వుడ్(14), అథంజే(12) క్రీజ్‌లో ఉన్నారు. ఓవర్‌నైట్‌స్కోర్ వికెట్ నష్టానికి 86పరుగులతో శనివారం రెండోరోజు ఆటను కొనసాగించిన విండీస్ జట్టు మెకెంజీ(32) వికెట్‌ను కోల్పోయిన అనంతరం లంచ్ విరామానికి వెళ్లింది. ఆ వికెట్‌కు అరంగేట్రం బౌలర్ ముఖేశ్ కుమార్ తీశాడు.

టైటిల్‌కు చేరువలో చిరాగ్-సాత్విక్

తొలిసారి కొరియా ఓపెన్ ఫైనల్లో ప్రవేశం

సియోల్: భారత స్టార్ డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి–చిరాగ్ శెట్టి జోడీ మరో టైటిల్‌కు చేరువైంది. ప్రతిష్టాత్మక కొరియా ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో చైనాకు చెందిన రెండో సీడ్. లియాంగ్ వీ కెంగ్–వాంగ్ చాంగ్‌పై వరుససెట్లలో గెలుపొందింది. 40 నిమిషాల పాటు హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో దూకుడుగా ఆడిన సాత్విక్–చిరాగ్ 21–15 24–22తో విజయం సాధించారు. తొలిసెట్‌లో ఆరు గేమ్ పాయింట్లు సాధించిన భారత ద్వయం రెండో సెట్‌లోనూ జోరు కొనసాగించింది. దాంతో, చైనా జోడీపై హ్యాట్రిక్ ఓటమి నుంచి తప్పించుకుంది. ఇటీవల జరిగిన ఇండోనేషియా ఓపెన్ టైటిల్ నెగ్గిన భారత తొలి డబుల్స్ ద్వయంగా రికార్డు నెలకొల్పిన సంగతి తెలిసిందే. మరో సెమీస్‌లో ఇండోనేషియాకు చెందిన టాప్‌సీడ్ ఫజర్ అల్ఫేన్, మహ్మద్ రియాన్ జోడీ 17–21, 21–16, 21–18తో కొరియా జోడీని ఓడించి ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్లోకి 2వ సీడ్ అన్–సే–యంగ్(కొరియా), టైజు–యింగ్(చైనీస్ తైపీ), పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి 4వ సీడ్ లో–కియాన్–వుయ్(సింగపూర్), ఆంటోన్సెన్(డెన్మార్క్) ప్రవేశించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68